# రెండవ భాగం:

## తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం

## 4. తెలుగు, బైబులు సామెతలు: నమ్మకాలు, విశ్వాసాలు

## 4. తెలుగు, బైబులు సామెతలు: నమ్మకాలు, విశ్వాసాలు

వితంతువు ఎదురైతే అపశకునమన్నది మనవారి నమ్మిక. తెలుగులో ఇలాటి నమ్మకాల మీద పుట్టిన సామెతలు ఎన్నో ఉన్నాయి.

'నాగుబాము గన్న, నంది బ్రాహ్మణు గన్న

చెవులుపిల్లి గన్న చేటువచ్చు....'గదా.

ఇటువంటి నమ్మకాలు కొన్ని ప్రాంతాలు, ప్రజలకు పరిమితమై ఉంటాయి. ఇవి ఆ యా సంస్కృతులలో అంతర్భాగాలు. అయితే నమ్మకాలకు, విశ్వాసాలకు కొంత అర్థభేదమున్నది. నమ్మకాలు కొన్ని మూఢమైనవి కావచ్చు. విశ్వాసమనే మాటలో దైవభక్తి కోణం కూడా ఉంటుంది. 'దిక్కులేని వాడికి దేవుడే దిక్కు' అనడంలోను, 'శివునాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు' అనడంలోనూ భగవత్సంకల్పం పట్ల ప్రగాఢ విశ్వాసం ద్యోతకమవుతున్నది. ఈ అధ్యాయంలో ఇటువంటి నమ్మకాలు, విశ్వాసాలను గురించి చెప్పే సమానార్థక తెలుగు, బైబులు సామెతలను పరిశీలిద్దాం.

**1**

తెలుగు సామెత : అడగనిదే అమ్మయినా పెట్టదు

బైబులు సామెత : అడిగితే ఈయబడును (మత్తయి 7:7)

అడగడం ఒక కళ. అప్పు అడగడం లలిత కళ అని హాస్యప్రియుల మాట. అయితే బైబులు అడగండి, వెదకండి, తట్టండి అని ప్రబోధిస్తున్నది. అడగడానికి ముందు ధైర్యం కావాలి. సరియైన ఈవిని అర్థించే వినయ వివేకాలుండాలి. మానవులు సైతం గర్వంగా అడిగినా, అడగరాని వేళ, అడగకూడనిది అడిగినా ఇవ్వరు. మానవులకు అన్నీ ఇవ్వడానికి సాధ్యపడదు. అయితే సర్వేశ్వరునికి సమస్తం సాధ్యం కనుక ఆయననే అడగండి అంటుంది బైబులు. కనుక మనం అడిగి, పొందవచ్చు. దీనికి విశ్వాసం కావాలి. దేవునితో మంచి సంబంధ బాంధవ్యం కలిగి ఉండాలి. దేవుడు నిర్దేశించిన మార్గంలో సాగుతూ ఉండాలి. అప్పుడు ప్రతి విషయాన్నీ దేవునికే

నివేదించవచ్చు! పొందవచ్చు! యేసు శిష్యులు మత్తయి, లూకాలు కూడా ఈ విషయాన్ని చెప్పారు. లూకా సువార్త 11:9 లో "మీరును అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును" అని ఉంది. దీనిని వివరించే ఒక ఉపమానం కూడా బైబులులో ఉంది. రాత్రివేళ తన ఇంటికి వచ్చిన మిత్రునికి పెట్టడానికి తన యొద్ద ఏమీలేకపోగా, ఒకడు తన వేరొక మిత్రుని ఇంటికి వెళ్ళి నాకు మూడు రొట్టెలు బదులివ్వమన్నాడు. లోపల మిత్రుడు నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి! పిల్లలు తనచుట్టూ పడుకొని నిద్రిస్తున్నారు. బయటినుండి స్నేహితుడు విడువక ప్రాధేయపడుతున్నాడు. ఎట్టకేలకు లోపలి మిత్రుడు లేచి స్నేహితునికి కావలసినవి ఇచ్చి పంపించాడు. ఆ విధంగా విసుగుకోకుండా గోజాడితే దైవం అన్నీ అనుగ్రహిస్తాడని భావం. అర్థింపుకు వినయం తోడైతే మొరపెట్టుకోవడమౌతుంది. దీనత్వం అంకురిస్తే అడగడం ప్రాధేయపడడం, లేక ప్రార్థించడం అవుతుంది.

ఇక్కడ కూడా కొంత చొరవ అవసరం. కన్నతల్లికి కుమారుని అవసరాలు బాగా తెలుసు. ఏ సమయానికి ఏమి కావాలో కూడా తెలుసు. అటువంటి మాతృమూర్తి కూడా అడగకపోతే పెట్టదంటూ ఉంటే చరాచరాఖిల జగన్నిర్మాత సర్వేశ్వరుడు అడగందే ఎలా ఇస్తాడు? ఇవ్వడు. అమ్మ కూడా మనం అడగకుండా ఉంటే ఆమెకిష్టమైంది ఇస్తుందేమో గాని మనకవసరమైనదాన్ని ఇవ్వదని భావించవచ్చు. కనుక మన అవసరాన్ని బట్టి అమ్మనైనా, ఆ దైవాన్నైనా అడిగి, అన్నీ పొందడం ఉత్తమం. అసలు ఎవరైనా "అడగండి ఇస్తాననడం"లో ఎంతో మేలుంది. మనకు అవసరమైనవన్నీ, అవసరమైనంత మేరకు అడగవచ్చు. వారే స్వచ్ఛందంగా ఇస్తే కొంచెమే ఇవ్వవచ్చు. అడిగి పొందడంలో అడిగేవాని అంతస్తు, ఆత్మ విశ్వాసం తొంగిచూస్తాయి. చాలా గొప్ప గొప్పవి అడిగి పొందడానికి ఆస్కారం ఉంది. తెలుగు సామెత అడగనిదే అమ్మయినా పెట్టదన్నా, అడుగుడీ మీకియ్యబడునని బైబులు సామెత చెప్పినా అడుగవలసిన అవసరాన్ని వివరిస్తున్నాయి.

## 2

తెలుగు సామెత : ఊరివాని బిడ్డను రాజుగారు కొడితే, రాజుగారి బిడ్డను దేవుడు కొడతాడు

బైబులు సామెత : మీరు కొలిచిన కొలతతోనే మీకును కొలవబడును (మార్కు 4:24)

రాజు సర్వాధికారి. 'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా?' అని తెలుగులో సామెత. రాజునకు తన రాజ్యంలో ఎదురు లేదు. అతడు ఆడింది ఆట, పాడింది పాట. అతడెవరినైనా శిక్షింపవచ్చు. రక్షింపనూ వచ్చు. రాజులను ఎదిరించే వారికి శిరచ్ఛేదనమే. చరిత్రలో చాలామంది రాజులు ప్రజారక్షణకు బదులు ప్రజాభక్షకులై బాధించారు.

రాజు కూడా మానవుడేనన్న విషయాన్ని మరిచిపోకుండా ఉన్నట్లయితే, రాజును, చరాచరాఖిల జగత్తును సృష్టించిన దైవం, రాజుకంటే బలవంతుడని నమ్మినట్లయితే రాజునకు, తాత్కాలికమైన అతని అధికారానికి ప్రజలు భయపడవలసిన పని లేదు. ప్రజలను రాజు బాధిస్తే అతనిని, అతని కుటుంబాన్ని దేవుడు బాధిస్తాడనే సిద్ధాంతం ధార్మిక వాదానికి, నైతిక బలానికి విలువను సంతరిస్తుంది. మహా కవి గురజాడ అప్పారావుగారు ముత్యాల సరాలలో రచించిన 'కన్యక' పాత్రను ఈ సందర్భంగా జ్ఞాపకం చేసుకోవాలి. రాజు కన్యకను బలాత్కరిస్తాడు. ఆమె అన్నదమ్ములు, బంధువులూ చూస్తూ, రాజుకు భయపడి నిర్వీర్యులై నిలబడతారు. కన్యక రాజునేలే దైవముండడొ అంటూ దైవమంటూ ఉంటే ఇటువంటి రాజును శిక్షింపకుండా ఉంటాడా? కాబట్టి మీరు విద్య నేర్చి వీర్యమును కలిగి జీవించి, మిమ్ములను మీరు రక్షించుకొనండని బోధించి ఆత్మాహుతి చేసుకుంటుంది. 'ఊరివారి బిడ్డలను రాజు కొడితే, రాజుగారి బిడ్డను దేవుడు కొడతాడన్నట్టు రాజు కోటపేటలు కూలిపోయినవి. అతడు మట్టిగరిచాడు. మనం ఏది చేస్తామో, దాని ఫలితాన్ని పొందుతామనేది ఈ తెలుగు సామెతలోని భావం.

బైబులు సామెతలో మీరు ఏ విధంగా ఇతరులకు కొలిచి ఇస్తారో, అదే విధంగా మీకు కొలవబడునని ఉంది. అంటే మీరు ఇతరులకు ఏమి చేస్తారో అదే మీకు కూడా చేయబడుతుంది. ఎవరిచేత? దైవం చేత. కర్మకారకంగా ఈ వాక్య నిర్మాణం జరిగింది. కాబట్టి దైవం పేరు చెప్పకపోయినా, మీరు ఇతరులకు చేసినట్లే మీకు దైవం చేస్తాడని అర్థం. మీరు ఇతరులను ప్రేమిస్తే దేవుడు మిమ్ములను ప్రేమిస్తాడు. మీరు ఇతరులను క్షమిస్తే దేవుడు మిమ్ములను క్షమిస్తాడని అంతరార్థం.

మానవాతీత శక్తి ఒకటుందని దానికి ఎవరే పేరు పెట్టుకున్నా, దైవమన్నా, తప్పు లేదని సామాన్యంగా అందరూ అంగీకరిస్తారు. ఆ దైవం మీద నమ్మక మున్నట్లయితే ధార్మిక చింతన ఒకటి హృదయంలో పాదుకుంటుంది. అన్నిటికీ కర్త

ఆ దైవమని, ఎవరి క్రియల ప్రకారం వారికి ఫలితాన్నిస్తాడని, కాబట్టి ఆ దేవునికి తప్ప మరెవరికీ భయపడనవసరం లేదని ధార్మికులకు ధైర్యం కలుగుతుంది. తెలుగు సామెత, బైబులు సామెతలు రెండూ రాజు ఈ లోకంలో బలవంతుడై ఇతరులను బాధిస్తే, దైవం రాజును, అతని కుటుంబాన్ని బాధిస్తాడని బోధిస్తున్నాయి.

## 3

తెలుగు సామెత : ఎవరి కర్మను వారు అనుభవిస్తారు

బైబులు సామెత : దుష్టుడు తన కార్యములకు తగిన ఫలమును పొందును, సజ్జనుడు తన పనులకు బహుమతి పొందును (సామెతలు 14:14)

'పునరపి జననం, పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం' అన్న శంకర భగవత్పాదుల అమోఘ వాక్కులను భక్తి శ్రద్ధలతో తలదాల్చిన జాతి భరత జాతి. ఈ ప్రాపంచిక దృక్పథం ఈ గడ్డపై పుట్టిన వారందరికీ సంక్రమిస్తూ దిశానిర్దేశనం చేస్తూ కొనసాగుతున్నది. దీనిని అనుసరించి గత జన్మ పాప పుణ్య ఫలాన్ని ఈ జన్మలో అనుభవించాలనేది భారతీయులు నమ్మే సత్యం. బైబులు సామెత కూడా ఇదే పదాలను ఉపయోగిస్తున్నది. అయితే ఇశ్రాయేలు జాతి ప్రాపంచిక దృక్పథంలో పునర్జన్మకు తావు లేదు. మనిషి ఒక్కసారే మరణిస్తాడు. ఆ తరువాత తీర్పు అని బైబులు సెలవిస్తున్నది.

ఇకపోతే ఈ రెండు సామెతలూ ప్రతిపాదిస్తున్న దివ్యోపదేశాన్ని నైతిక నియమాలకు, సామాజిక కట్టుబాట్లకు, దైవ శాసనానికీ లోబడకుండా ఇంద్రియాల లంపటంలో పడి విషయాసక్తితో సన్మార్గం విడిచినవారు శిలా శాసనం వలె ఎంచి గుర్తుంచుకోవాలి. ప్రతిదానికీ, దానికి తగిన ప్రతిక్రియ ఉండడమనేది ప్రకృతి ధర్మం. మనం చేసిన ప్రతిదానికీ ప్రతిఫలం తప్పక అనుభవించవలసి ఉంటుంది. పిల్లల పెంపకాన్ని విస్మరించి ఉద్యోగ ధర్మంలో, ధన సముపార్జనలో తలమునకలయ్యే తల్లిదండ్రులు తమ వృద్ధాప్యంలో పిల్లల మమతానురాగాలకు నోచుకోరు. మన క్రియలన్నిటికీ సమానమైన వ్యతిరేక ఫలితం మనమే అనుభవించడం అనివార్యం.

అలానే బైబులు సామెతలో చెప్పినట్టు సన్మార్గులకు ఏదో ఒక రూపంలో వారి పుణ్యకార్యాల ఫలం వారికి అందుతుంది. పేదను ఆదరించి ఒక్క గిన్నెడు చన్నీరు ఇచ్చినా అది ఊరికే పోదు అని యేసుక్రీస్తు ఉవాచ. దుష్కర్మలకు ఫలితంగా రానున్న శిక్ష, పుణ్యాత్ములకు దక్కనున్న ప్రతిఫలం దృష్ట్యా మనుషులు ఋజువర్తనులై సన్మార్గంలో నడుచుకోవడం మంచిదని ఈ సామెతల నుండి నేర్చుకోవాలి.

## 4

తెలుగు సామెత : చేసిన పాపం చెబితే పోతుంది

బైబులు సామెత : పాపములను ఒప్పుకొని వానిని పరిత్యజించువాడు దేవుని దయను పొందును (సామెతలు 28:13)

అసలు పాపం చెయ్యడమెందుకు, దాన్ని గురించి ఇతరులకు చెప్పడమెందుకు అనే అనుమానం మనకు రావచ్చు. తప్పు చేయడం, లేక పాపం చెయ్యడం మానవుల సహజ గుణం. అలాగని అస్తమానం తప్పులు చేస్తూ పోకుండా, ఆ చేసిన తప్పులు పరిహరించుకోవడానికి ఒక మార్గం చూడాలి. ఆ మార్గాల్లో ఒకటి – తాను చేసిన పాపాన్ని ఇతరులతో చెప్పడం. చెబితే చేసిన పాపం ఎలా పోతుందనే మీమాంసలో మనం పడవచ్చు. పాపం మానవుణ్ణి క్రుంగదీస్తుంది. మోయలేని భారమై పాపిని అణచివేస్తుంది. అది హృదయంలో అలాగే ఉంటే ఆ భారం దినదిన ప్రవర్ధమానమై, మానవుణ్ణి మసిచేస్తుంది. కనుక తనలో ఉన్న, తాను చేసిన తప్పును గూర్చి, పాపాన్ని గూర్చి ఆప్తులకు, మిత్రులకు చెబితే దానికి సంబంధించిన బరువు భారాలు, ఆవేదన ఆలోచనలు తొలగిపోయి, హృదయం తేలికవుతుంది. పదిమందికీ తన దోషాన్ని గూర్చి తెలపడం వల్ల దోషిలో పరివర్తన వస్తుంది. దోషపూరితమైన, లేక పాప పంకిలమైన అంతరంగం పరిశుద్ధమై, అతడు పాపం చెయ్యకుండా పవిత్రుడుగా జీవించే అవకాశం కలుగుతుంది. ఇదిగో ఈ విధానాన్ని జ్ఞాపకం చేస్తూ ఈ తెలుగు సామెత ప్రచారంలోనికి వచ్చింది. చేసిన పాపం చెబితే పోతుందని.

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని అందిస్తుంది. పాపం చేసినవాడు మొట్టమొదట తాను చేసింది పాపమని తెలుసుకోవాలి. దాన్ని చేశానని అంగీకరించాలి.

ఆపైన ఎన్నడూ పాపం చేయనని నిర్ణయించుకొని, ఆ పాపాన్ని పరిత్యజించాలి. అప్పుడు దైవం అతణ్ణి దయదలుస్తాడు. అతడు సన్మార్గగామిగా బ్రతుకు సాగిస్తాడు. ఇదంతా జరగాలంటే ముందు మానవునిలో మార్పు రావాలి. బుద్ధిపూర్వకంగా ఏ తప్పు చేయకూడదనే దృఢ సంకల్పం కావాలి. అప్పుడు కొత్త జీవితం ఆరంభమౌ తుంది.

తప్పులు చేయడం సర్వసాధారణం. అయితే అది తప్పు అని తెలిసిన తరువాత, ఆదే తప్పును మరల చేయకుండా, దాన్ని వదలివేయడం గొప్ప కార్యమని పెద్దలు చెబుతారు. ఇదే భావాన్ని తెలుగు, బైబులు సామెతలు ముక్తకంఠంతో వివరిస్తున్నాయి.

## 5

తెలుగు సామెత : తనదు మేలు కీడు తన తోడనుండురా

బైబులు సామెత : వారి క్రియలు వారి వెంట పోవును (ప్రకటన 14:13)

మానవుడు తన జీవితంలో ప్రతిరోజూ ఎవరికో ఒకరికి మేలును; కావాలనో, పొరపాటునో ఇతరులకు కష్టాన్ని, నష్టాన్ని కలిగిస్తాడు. ఇతరులను సమయానికి ఆదుకున్నప్పుడో, లేక వారి కష్టకాలంలో ధైర్యాన్నిచ్చినప్పుడో సహాయం పొందినవారితో పాటు తాను కూడా సంతృప్తిని, సంతోషాన్ని పొందుతాడు. అది అతని మనస్సులో పదిలంగా ఉండి మరిన్ని మంచి పనులు చేయడానికి దోహదం చేస్తుంది. అదే విధంగా ఇతరులను తెలిసో తెలియకో బాధపెట్టినప్పుడో వారికి కష్టాన్ని కలిగించినప్పుడో వారు ఎదగకుండా అడ్డుకున్నప్పుడో ఒకలాంటి అపరాధ భావం చోటుచేసుకుంటుంది. అవి మానవుని మనసులో ముద్రవేసి అతనికి అశాంతిని కలిగిస్తాయి. అవి కూడా అతనికి ఎప్పుడూ గుర్తుండి, మరోసారి ఆ తప్పు చేయకుండా హెచ్చరిస్తుండవచ్చు, లేక మరిన్ని చెడు పనులు చేయడానికి పురికొల్పనూ వచ్చు. అందుకే మానవుడు చేసిన పాప పుణ్యాలెప్పుడూ అతనితోనే ఉంటాయని పెద్దలు అంటారు. బైబులు సామెత కూడా మానవుడు చేసే ప్రతీ క్రియ కూడా అతని వెంటే ఉంటుందని చెబుతుంది. చేసే పనిని జాగ్రత్తగా చేయాలని అది ఇతరులకు హాని చేస్తుందో, లేక మేలు చేస్తుందో ఆలోచించుకుని మొదలుపెట్టాలని ఈ సామెతల నుండి నేర్చుకోవచ్చు.

బైబులు సామెతలో ఐహికం నుండి ఆముష్మికం లోకి ఒక వ్యక్తి కర్మఫలం అతణ్ణి అనుసరిస్తూ పోతుందనే భావం ఉంది. శరీరంతో ఉండగా చేసిన పాపపుణ్యాలు తనువు చాలించాక ఆ వ్యక్తి స్వర్గ నరకాలను నిర్ణయిస్తాయనేది ధార్మికులు సామాన్యంగా నమ్మే సత్యం.

## 6

తెలుగు సామెత : తానొకటి తలచిన దైవమొకటి తలచును

బైబులు సామెత : నరులు ప్రణాళికలు వేసుకొనవచ్చును. కాని దైవ సంకల్పమే నెరవేరును (సామెతలు 19:21)

ఇది విశ్వవిఖ్యాత సత్యం. మానవుడు ప్రతిపాదిస్తాడు. కానీ జరిగేది మాత్రం దైవ సంకల్పానుసారమే జరుగుతుందనే భావం ఇమిడి ఉన్న సామెతలు అన్ని సంస్కృతులలోనూ కనిపిస్తాయి. అందుకే

'దశరథుండు రాముధరణికి పట్టంబు
గట్టదలచె, నపుడు కట్టె జడలు
తలపు మనది కాని దైవిక మదివేరు' అని వేమన కూడా అన్నాడు.

తన జ్యేష్ఠ పుత్రుడు సకల గుణాభిరాముడు అయిన రామభద్రుని రాజ్యాభిషిక్తుణ్ణి చేయ తలపెట్టి సర్వ సన్నాహాలు పూర్తి చేశాడు దశరథ మహారాజు. కానీ ఏమి ప్రయోజనం? నవరత్న ఖచిత రాజ మకుటం విరాజిల్లవలసిన తలపై కేశాలు జడలు గట్టాయి. రాజ్యమేలుతాడనుకున్న రాముడు కారడవుల పాలయ్యాడు.

దైవం, విధి, తలరాత, కర్మఫలం. . . ఇలా పదమేదైతేనేమి? మనషులంతా గుర్తించిన సత్యమిదే. మనం పథకం వేసుకొని దాన్ని జరిగించుకోగలిగిన పరిస్థితి లేదు. అనుకున్నది అనుకున్నట్టు జరిగితే ఆనందించడమే తప్ప, అనుకోనిది జరిగితే చింతించి ప్రయోజనం లేదు. అందుకే జరిగేవన్నీ మంచికని అనుకోవడమే మనిషి పని అన్నారు పెద్దలు.

బైబులు ఈ విషయాన్ని సందర్భోచితంగా పలుమార్లు నొక్కి చెప్పింది, భక్తిపరులు, భక్తిహీనులు అని లేకుండా ప్రతి ఒక్కరూ ఏవేవో ప్రణాళికలు అల్లుకోవడం, చివరికి విధి బలీయమన్న సత్యాన్ని అనుభవ పూర్వకంగా గ్రహించడం బైబులు చరిత్రలో

చూస్తాము. ఈ సామెత సొలొమోను మస్తిష్కంలో మెదలడంలో మనకు అతని తండ్రి దావీదు మహారాజు స్ఫురిస్తాడు. సర్వోన్నత సర్వేశ్వరునికి చంద్రునికో నూలుపోగుగా ఒక ఆలయం నిర్మించాలని దావీదు తహతహలాడాడు. అందుకోసం స్థలం, సామగ్రి, నిపుణులు, సమస్తం సేకరించాడు. దావీదు అనే 'నరుడు' పథకాలు చాలా పకడ్బందీగా సిద్ధం చేసుకొన్నాడు. కాని ప్రత్యుత్తరమిచ్చినది మాత్రం ప్రభువే. ఆయన 'నిర్మాణం నీ చేతుల మీదుగా జరుగరాదు, ఆ కార్యం శాంతి సార్వభౌముడైన నీ కుమారునిది' అని ఒక్క మాటలో తన అభీష్టాన్ని వెల్లడించాడు. ఈ వ్యవహారమంతటిలో సొలొమోను రొట్టె విరిగి నేతిలో పడినట్టయింది. ఏర్పాట్లన్నీ తండ్రి సంపూర్ణం చేశాడు. ఆలయ నిర్మాణకుడన్న కీర్తి మాత్రం తనకు దక్కింది.

తెలుగు సామెతలో ఆశలు అడియాశలైన విధి వంచితుని నిర్వేదం కనిపిస్తుంది. బైబులు సామెతలో అంతకు మించిన ఉదాత్తభావం గోచరిస్తున్నది. దైవ సంకల్పం అమోఘం, అనివార్యం అన్న స్పృహ బైబులు సామెతలో అంతర్లీనంగా ఉంది.

## 7

తెలుగు సామెత : తొలకరి చెరువు నిండినా, తొలిచూలు కొడుకు పుట్టినా మేలు

బైబులు సామెత : యౌవనమున పుట్టిన కుమారులు వీరుని చేతిలోని బాణములవంటివారు (కీర్తనలు 127:4)

రోహిణికార్తె గడిచి తొలకరి జల్లులు నేలను తడుపుతాయి. కొన్ని ఊర్లకు చెరువే ప్రాణాధారం. వానలకు చెరువు నిండితే మనుషులకూ పశువులకూ కమ్మని నీరు లభిస్తుంది. చెరువు తామరలతో కలువలతో పక్షులతో కళకళలాడడం ఊరికే శోభ. కుటుంబానికి తొలిచూలు కొడుకూ అలాటివాడే అంటున్నది తెలుగు సామెత. తన బాధ్యత లొక్కక్కటిగా పెరిగి పెద్దవాడైన తనయుడు అందిపుచ్చుకుంటుంటే కొడుకు అందివచ్చాడని తండ్రి మురిసిపోతాడు. బాధ్యత గల పెద్ద కొడుకు తన తమ్ముళ్ళ చెల్లెళ్ళ బాగోగులు తండ్రి తరువాత తండ్రిగా తానే చూసుకుంటాడు. అందుకే

‘తండ్రి కన్న సుగుణి తనయుడై యొప్పినా
పిన్న పెద్దతనము లెన్నరెవరు
వాసుదేవు విడిచి వసుదేవునెంతురా’

అంటూ వేమన తండ్రికి గర్వకారకుడైన కొడుకు ఘనతను ప్రశంసించాడు.

కీర్తనల్లో ఎదురైన పై బైబులు సామెతకు విశిష్టార్థమే ఉంది. ఇక్కడ తొలిచూలు మగ సంతతిని కీర్తనకారుడు బాణంతో పోలుస్తున్నాడు. విలుకాడు వెళ్ళలేని చోట్లకు అతడు విడిచిన బాణం వెళుతుంది. తాను సాధింపలేకపోయిన కార్యాలు కొడుకు సాధిస్తుంటే తండ్రి మనస్సు గర్వంతో ఉప్పొంగిపోతుంది. అందుకే తాము సాకారం చేసుకోలేకపోయిన స్వప్నాలను తనూజునికి తరలించడం తండ్రులకు పరిపాటి.

ఇందులో మరొక అంశముంది. తండ్రి చేతిలో సుశిక్షితుడైన కుమారుడు కడు సమర్థుడౌతాడు. ఆ బాణాన్ని ఎక్కుపెట్టి గురిచూచి వదలాలి. కుమారులకు దిశానిర్దేశనం చేయవలసింది తండ్రే. ఆపైన ఆ బాణం రివ్వున ఎగిరివెళ్ళి లక్ష్యాన్ని ఛేదించడం వీరునికెంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తుంది.

పై ఉదహరించిన రెండు సామెతలూ పురుషాధిక్య సమాజాలలో సగటు జీవికి పుత్ర సంతానంపై ఉండే మక్కువకు మకురం పడుతున్నాయి.

## 8

తెలుగు సామెత : దిక్కు లేనివారికి దేవుడే దిక్కు

బైబులు సామెత : దిక్కులేని వారికి దేవుడే దయచూపును (హోషేయ 14:3)
ప్రభువు వితంతువు పొలము గట్టును కాపాడును
(సామెతలు 15:25)

‘వసుధ వసియించు భోగసర్వస్వమునకు
స్వామిత వహించి మనుజుండు ప్రభవమొందు;
ఎవడపహరించెనేమయ్యో నీమె సుఖము
కలుషమెఱుగని దీని బిడ్డల సుఖంబు?’

అంటాడు గుఱ్ఱం జాషువా కవి 'అనాథ' అనే తన కవితా ఖండికలో. ఈ భూమి మీద జన్మించే ప్రతివారూ కొంత ఆస్తికి, ఆలంబనకు వారసులుగానే జన్మిస్తారు. అంటే జన్మించే ప్రతివారికి ఏదో ఒక దిక్కూ, ఆధారం ఉంటుంది. అలా లేకుండా కొందరు అనాథలుగా, అనాథులుగా ఉంటారు. అటువంటి వారికి దేవుడే దిక్కని ఈ తెలుగు సామెత తెలియజేస్తున్నది. ఏదో ఒక దిక్కు గలవారికి దేవుడు దిక్కుగా, ఆధారంగా ఉండడా అనే అనుమానం మనకు కలుగవచ్చు. ఆ మాటకొస్తే, అందరికి దేవుడే దిక్కు. ఇక్కడ దిక్కు లేనివారి ప్రస్తావన వచ్చింది కాబట్టి వారి దిక్కును గూర్చి మాత్రమే ప్రస్తావించాలి. దిక్కు లేనివారు పూర్తిగా దేవుని మీదనే ఆధారపడి ఉంటారు. ఆయన తప్ప ఇంకెవ్వరూ తమకు లేరని మనసా, వాచా, కర్మణా ఆయననే స్మరిస్తూ ఉంటారు కనుక దిక్కులేని వారికి దేవుడు తప్పకుండా దిక్కై రక్షిస్తూ ఉంటాడు. ఇటువంటి సందర్భాలలో ఈ తెలుగు సామెతను వాడుతుంటారు.

బైబులు సామెతలు కూడా అనాథలను అనాథులును గురించి, దిక్కులేనివారిని గురించి ప్రస్తావిస్తున్నాయి. వితంతువు అంటే భర్త చనిపోయిన స్త్రీ. పురుషాధిక్య సమాజాలలో దిక్కులేనిదని భావం. అటువంటి దిక్కులేని వారికి దేవుడే దిక్కని ఈ బైబులు సామెత కూడా తెలుపుతున్నది. నిరాధారుల ఆస్తిపాస్తులను, బలహీనుల పొలాలను బలవంతులు ఆక్రమించుకుంటారు. అటువంటి సమయాలలో వితంతువుల పొలం గట్లను ప్రభువు కాపాడుతాడని బైబులు సామెత విశదీకరిస్తున్నది. పొలమంటే పొలాన్నే కాదు, అన్ని విషయాలలో ఆ దిక్కు లేనివారికి దేవుడే దిక్కుగా, ఆధారంగా వచ్చి రక్షిస్తాడని భావం.

పూర్తిగా భగవంతుని మీదే ఆధారపడి ఉన్నవాళ్ళను ఆయన తప్పకుండా రక్షిస్తాడు. ఇది తెలుగులోనే కాక అన్ని భాషలలోనూ సుప్రసిద్ధి వహించిన సామెత. ఇందుకు అన్ని మతాల గ్రంథాలు కూడా సాక్ష్యాధారాలుగా నిలుస్తాయి. ఇదే అర్థాన్ని తెలుగు, బైబులు సామెతలు రెండూ సమతుల్యంగా, సమానార్థకాలుగా తెలియజేస్తున్నాయి.

## 9

తెలుగు సామెత : నారు పోసినవాడు నీరు పోయకమానడు

బైబులు సామెత : పరలోక పిత మీ అవసరములనెల్ల గుర్తించును (మత్తయి 6:31)

అన్నిటికీ దేవుడే దిక్కు అని భావించి, నిశ్చింతగా ఉండేవారి విషయంలో ఈ సామెతలను వాడతారు. సృష్టించినవాడే పోషిస్తాడని దీని భావం.

నిబ్బరంతో నిశ్చింతగా నిలబడి సమస్త భారం దేవుని మీద వేసి, కష్టించి పనిచేసే వారికి ఈ తెలుగు సామెతను అన్వయించాలి. నారు పోయడం పల్లె పదం. నాటినవాడు తప్పకుండా నీరు పోయాలి. లేకపోతే నారు ఎండిపోయి ఫలితం లేక నష్టం వస్తుంది. ఇందులో కష్టించి పనిచెయ్యవలసిన కర్తవ్యం నారుపోసిన వాడికి ఉంది.

యేసుక్రీస్తు తన విశ్వవిఖ్యాత పర్వత ప్రసంగంలో పలికిన పై బైబులు సూక్తిని నారు పోసినవాడు నీరు పోయకమానడనే అర్థం ప్రతిబింబించేలా పలికాడు. ఆకాశంలో ఎరిగిపోయే పక్షులకు ఏరోజుకారోజు విధాత ఆహారమియ్యడం లేదా? ఒక్కరోజులో కుసుమించి సాయంత్రానికి వాడిపోయే గడ్డిపూలకు రంగులద్దడం లేదా? అలాటి అల్ప ప్రాణులను దేవుడంతగా పట్టించుకుంటుండగా తన జీవనోపాధికై కష్టించే మనిషి దిగులు పెట్టుకోవడం ఏమి సమంజసం? అనే భావాన్ని ప్రతిపాదించి ఈ బైబులు సామెత దేవునిపై భారం వేసి కర్తవ్యం నిర్వహిస్తూ ముందుకు సాగిపొమ్మని ఉద్బోధిస్తున్నది.

భగవద్గీత సారాంశమిదే. నీ ధర్మాన్ని నిర్వర్తించి ఫలితాన్ని ప్రభువుకి విడిచిపెట్టు. గాలిలో దీపం పెట్టిన చందాన కాదు. కర్తవ్యం విస్మరించక కష్టించి పనిచేస్తే ఫలితం దేవుని మూలంగా ప్రాప్తిస్తుంది అని ఈ సామెతల భావం.

## 10

తెలుగు సామెత : నిజము కురచ, బొంకు నిడివి (పొడవు)

బైబులు సామెత : స్వర్గ మార్గము ఇరుకైనది, నరక మార్గము వెడల్పైనది (లూకా 13:24).

నిజం నిరాకర్షణగానూ, బొంకు ఆకర్షణీయంగానూ ఉన్న సమయంలో ఈ సామెతలనుపయోగిస్తారు. నిజం నిష్ఠూరంగా ఉంటుందని కూడా ఈ సందర్భంలో చెబుతారు. అబద్ధాన్ని అందరూ నమ్మాలంటే దాన్ని ఆకర్షణీయంగా చెప్పాలి. పైపై మెరుగులు చూపించాలి. ఇది బొంకు కాదు నిజమే అన్నంతగా నమ్మించడానికి

ఎన్నైనా అలంకరణలు చెయ్యాలి. నిజం నిరలంకారంగా ఉన్నా అది ఎన్నటికీ మార్పు చెందనిది కాబట్టి కురచయైనా ఫర్వాలేదు – బొంకును మాత్రం వినసొంపుగా, తియ్యగా చెప్పాలి. నిజం చేదుగా ఉన్నా అది నిలకడ మీద సత్ఫలితాన్నిస్తుంది. గుణగ్రహణపారీణులు దాన్ని గ్రహిస్తారు. కాబట్టి నిజానికి నగిషీలు చెక్కి నిలువబెట్ట వలసిన పని లేదు. నిజం నిరంతరం నిలుస్తుంది కాబట్టి అది నిశ్చలంగా, నిర్మలంగా ఆడంబరాలు లేకుండా ఉంటుంది. కాబట్టి "నిజం కురచ బొంకు పొడవు" అనే సామెత ప్రచారంలో ఉంది.

చెడు నిరంతరం ఆకర్షణీయంగా, ఎటువంటి నిబంధనా, నియమావళి లేకుండా విచ్చలవిడిగా ఉంటుంది. క్రమం లేకుండా ఉంటుంది. యేసు ఒకసారి గ్రామాలలో సంచరిస్తూ ఉండగా ఒకడు వచ్చి, "ప్రభువా, రక్షణ పొందేవారు కొద్దిమందేనా?" అని ప్రశ్నించాడు. అప్పుడు ఆయన స్వర్గ మార్గం ఇరుకైనదనీ, దానిలో ప్రవేశించడానికి పాటుపడమనీ, అనేకులు ప్రయత్నిస్తారు గాని విఫలులౌతారనీ అతనితో చెప్పాడు. మోక్ష మార్గం క్రమమైన నియమ నిబంధనలు కలది. అంటే మాటలో, చేతలో, హృదయంలో క్రమం ఉండాలి. ఆ జీవితం అసిధారావ్రతం లాంటిది. ఏమాత్రం కాలుజారినా తెగిపోతుంది. సత్యం చెప్పాలి, సత్క్రియ చెయ్యాలి, సద్భావన కావాలి, శత్రువును ప్రేమించాలి, హింసించేవారిని దీవించాలి, మనోవాక్కాయ కర్మలలో పవిత్రత ప్రతిఫలించాలి. ఇటువంటి జీవితం నిజంగా ఇరుకు మార్గంలో ప్రయాణమే కదా! ఇటువంటి కష్టసాధ్యమైన ఇరుకు మార్గంలో సాగినవాడే దేవుని రాజ్య పౌరుడౌతాడు. అందుకే నిజం కురచగా ఉంటే బొంకు నిడివిగా ఉండి ఆకర్షణీయంగా ప్రతివారినీ తనవైపు తిప్పుకుంటుంది. ఇరుకు మార్గం నిజమైన మార్గమై, దేవుని రాజ్యానికి చేరుస్తుంది. నరక మార్గం వెడల్పుగా, ఆకర్షణీయంగా ఉండి పతనానికి దారితీస్తుంది.

## 11

తెలుగు సామెత : నిప్పుకు చెదలంటునా?

బైబులు సామెత : దైవ భయము కలవానికి పాపమంటునా? (సామెతలు 16:6)

నిప్పు తన దగ్గరకు ఎటువంటి చెడ్డ వస్తువులను, జీవులను రానివ్వదు. నాశనాన్ని కొనితెచ్చే జీవాలను, చెడును చేసేవాటిని నిప్పు సమూలంగా నాశం చేస్తుంది. దైవ భయము కలిగి, క్రమశిక్షణలో, సన్మార్గములో నడిచే వ్యక్తికి ఎటువంటి చెడు లక్షణాలు

దరిచేరవు. ఒకవేళ ఏవైనా చెడు అలవాట్లు, ఆలోచనలు దరిచేరినా తన క్రమశిక్షణతో, దైవభయమనే లక్షణం సాయంతో  వాటిని దూరంగా తరిమివేయ గలుగుతాడు. నిప్పు దగ్గర చెదలు పుట్టడం గాని, చీడపురుగులు చేరడం గానీ జరగదు. దైవ భయము కలిగినవాడికి ఎటువంటి పాపములు దరిచేరవు. పాపము చేస్తే దేవునికి దూరమైపోతాననే భయమే పాపములో పడకుండా ఆ వ్యక్తిని కాపాడుతుంది. అటువంటి వ్యక్తి దరిదాపులకు వెళ్ళడానికి కూడా పాపము జంకుతుంది. క్రమశిక్షణ, దైవ భయమనేవి చెడు మార్గములో వెళ్ళకుండా ఉండేందుకు ఉపయోగపడతాయని ఈ రెండు సామెతల ద్వారా మనకు తెలుస్తుంది.

‘కుండలి యోగము తెలిసిన
బండాలము యోగికేల బాలిక పొందు
దండిగ నా తనువందునె
మెండుగ నిల ముక్తి కాంత మెలగుర వేమా’

కుండలి యోగము నెరిగిన ఉత్తమ యోగికి స్త్రీ సంగమంపై కోరిక ఉండదు. ముక్తి కాంతయే మదిలో మెదులుతుండగా మానవ కాంతలపై అట్టివానికి మనసెలా నిలుస్తుంది? అని అందుకే అంటాడు వేమన.

ఇలాటి పరమ భక్తులను లోకం తాత్కాలికంగా అర్థం చేసుకోలేకపోవచ్చు కానీ భక్తులు మాత్రం పరిశుద్ధాంతఃకరణులై, దురితదూరులై ఉంటారు. సబ్బుకు మురికి కావడం, నిప్పుకు చెదలంటడం ఊహించలేము.

దైవం పట్ల భయభక్తులే మనిషి నైతిక వర్తనకు శ్రీరామరక్ష అని పై సామెతల భావము.

## 12

తెలుగు సామెత : నీరు పల్లమెరుగు, నిజము దేవుడెరుగు

బైబులు సామెత : నరుల హృదయములు దేవునికి తెలియును (సామెతలు 15:11)

పంచదార తియ్యగా ఉండడం లోక ప్రసిద్ధం. అలాగే నీరు పల్లానికి ప్రవహించడం జగమెరిగిన సత్యం. వీటిని కాదనేవాడు అబద్ధీకుడని అందరూ అంగీకరిస్తారు. అదే

విధంగా నిజం దేవునికి తెలుసు. ఎక్కడ దాగినా, ఏమి చేసినా దేవుని యెదుట నిజాన్ని దాచలేము. ఈ నిత్యసత్యాలను వివరించే సమయంలో పై సామెతలను ప్రయోగిస్తారు.

సర్వేశ్వరునికి పాతాళం, అగాధ కూపాలు కనబడతాయి. ఆయన సృజించిన నరుల హృదయాలు ఆయనకు మరీ తేటగా కనబడతాయి కదా! ఆయన భూమ్యాకాశాలను, సముద్రాన్ని, దానిలో ఉన్న సమస్తాన్ని సృజించాడు, మానవుని సృజించాడు. "అందుకే కన్నులు కలిగించినవాడు కానకుండునా" అంటాడు భక్తుడు. దావీదు – "నా నడకను నా పడకను నీవు పరిశీలన చేసియున్నావు. నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొనియున్నావు. దేవా, మాట నా నాలుకకు రాకమునుపే అది నీకు పూర్తిగా తెలిసియున్నది. వెనుకను ముందును నీవు నన్ను ఆవరించి యున్నావు" (కీర్తన 139:3–5) అంటూ సర్వశక్తుడైన దేవునికి అన్నీ తెలుసునని స్తుతిస్తున్నాడు. నీరు పల్లమెరిగినట్లు, దేవునికి నిజం తెలుసుననీ, దేవుని నుండి ఏమీ దాచలేమని ఈ సామెతలు తెలుపుతున్నాయి.

## 13

తెలుగు సామెత : పాపి చిరాయువు

బైబులు సామెత : దుర్మార్గుడు చాలాకాలము జీవించును (ఉపదేశకుడు 7:15)

ఇదొక విధి విలాసం. దుష్కృతాలు నరకహేతువులైనప్పటికీ దుష్టుడు చిరంజీవిగా మనగలగడం లోకంలో తారసపడే వాస్తవం. ఒకవేళ ఘాతుకుడు తన దౌష్ట్యాన్ని విడిచి సన్మార్గంలోకి రావాలని విధాత అతనికి ఆయువు పొడిగిస్తున్నాడేమోననుకోవాలి. అటు తెలుగు సామెతా ఇటు బైబులు సామెతా ఈ ధర్మసూక్ష్మాన్ని గ్రహించినట్టు తోస్తున్నది.

బతకని బిడ్డ బారెడని మృతపిండం గురించి విశేషంగా చెప్పుకుంటారు. రోగాలతో రొష్టులతో సతమతమయ్యేవారే ఎందుచేతనో చిరకాలం జీవిస్తారు. అయితే ఇక్కడి ప్రస్తావన పాపుల దీర్ఘాయువు గురించి. మంచివాళ్ళను దేవుడు త్వరగా తీసుకు పోతాడన్న నానుడి కూడా ఉంది. అందరి తలలో నాలుకలా మెలిగినవాడు త్వరగా కాలం చేస్తాడు. అతడు మరికొంతకాలం బ్రతికి ఉంటే బాగుండునని ఇరుగుపొరుగు వారిలో మెదిలే ప్రగాఢమైన ఆకాంక్ష వారిచే అలా అనిపిస్తుంది.

ప్రజాకంటకుడొకడు తన దురాగతాలలో యథేచ్ఛగా కొనసాగుతుంటే వీడికి చావైనా రాదేమిటని ఆడిపోసుకునే లోకులకు అతడు చిరకాలం జీవిస్తున్నట్టు తోస్తుంది. పాపి చిరాయువు అనే నానుడికి బహుశః ఇదే కారణం కావచ్చు.

## 14

తెలుగు సామెత : పుట్టించినవాడు పూరిమేపడా?

బైబులు సామెత : దేవుడే సమకూర్చును (ఆదికాండము 22:14)

మానవులలోని నిబ్బరాన్ని, విశ్వాసాన్ని చాటి చెప్పడానికి ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు. ఇందులో మూర్ఖత్వం ఉన్నదని కొందరు భావిస్తారు. ఒక్కొక్కసారి విశ్వాసం కూడా మూర్ఖత్వంగా కనిపిస్తుంది. విశ్వాసమంటే .... తాను కోరుకున్నది, తాను ఆశించినది, అంటే నిరాకారమైనది సాకారమై దైవ చిత్త ప్రకారం దేవుని ద్వారా తనకు లభిస్తుందని భావించడం. ఇటువంటి విశ్వాసం విషయంలో అవగాహన లేనివారికి ఆ విశ్వాసం, ఆ నిరీక్షణం మూర్ఖత్వంగా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. ఆ విశ్వాసం నుండి పుట్టినదే ఈ తెలుగు సామెత. పుట్టించినవాడే పోషించి తీరుతాడన్న దృఢ విశ్వాసం ఈ సామెతలో ఉన్నది. అటువంటి విశ్వాసానికి, నిరీక్షణానికి తావలమైన సందర్భాలలో ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

బైబులులో అబ్రాహామనే భక్తుడు అచంచలమైన విశ్వాసం గల ఒక దైవజనుడు. అతనికి చాలా కాలం తరువాత దైవం ఒక కుమారుణ్ణి అనుగ్రహించాడు. అనతి కాలంలోనే అబ్రాహాముని పరీక్షించడానికి లేక లేక కలిగిన ఆ కుమారుణ్ణి తనకు బలిగా అర్పించమని దైవం అబ్రాహాముని ఆజ్ఞాపించాడు. అబ్రాహాము ఏ మాత్రం సంశయించకుండా తన కుమారుడైన ఇస్సాకును బలిగా సమర్పించడానికి సిద్ధపడ్డాడు. దాదాపు వంద సంవత్సరాల వయసులో ముసలివాడైన తనకు సంతానాన్ని అనుగ్రహించిన దైవం సమస్తాన్నీ సమకూర్చడానికి సమర్థుడని అబ్రాహాము దృఢ విశ్వాసం. అందుకే ముసలితనంలో పుట్టిన తన ఏకైక కుమారుణ్ణి బలి చేయడానికి కత్తి పైకెత్తాడు. వెంటనే దైవం “అబ్రాహామా, ఆ పిల్లవాని మీద చెయ్యి వెయ్యవద్దు’ అన్నాడు. మరి బలి అర్పించడానికి పశువు కావాలి కదా? వెనుక పొదలో పొట్టేలు చిక్కుకొని సిద్ధంగా ఉంది. అబ్రాహాము కుమారునికి మారుగా దేవుని సూచన మేరకు పొట్టేలును సమర్పించాడు. అసలు బలిపీఠాన్ని సమీపిస్తున్నప్పుడు ఇస్సాకు

తండ్రితో 'కట్టెలున్నవి, కత్తి ఉన్నది, అగ్ని ఉన్నది, బలి అర్పించడానికి బలిపశువు ఏది?' అని ప్రశ్నించాడు. తానే బలిపశువు కాబోతున్నాడన్న సంగతి అతనికి తెలియదు. వెంటనే అబ్రాహాము 'అది దేవుడే సమకూర్చుతాడు' అని జవాబిచ్చాడు. అదుగో అదే ఈ బైబులు సామెత. అన్నీ సమకూర్చేవాడు దేవుడే అనే ఆ దృఢ విశ్వాసం ఈ సామెతలో ఉన్నది.

పుట్టించినవాడు పూరిమేపడా? అన్న భావం కూడా బైబులు సామెతలో ఉన్నది. ఇలా దైవం మీద భారం వేసి తమ జీవితాలను గడుపుతున్నవారు అచంచలమైన విశ్వాసం గలవారు ఈ రెండు సామెతలను ప్రయోగిస్తారు. కనుక ఈ బైబులు, తెలుగు సామెతలు రెండూ సమానార్థకాలే.

## 15

తెలుగు సామెత : పోయినోళ్ళందరూ మంచోళ్ళు

బైబులు సామెత : బ్రతికి బట్టకట్టియున్న వారికంటే చనిపోయి దాటిపోయినవారు మెరుగు (ఉపదేశకుడు 4:2)

'బ్రతుకవచ్చు నొడల ప్రాణంబులున్న, బ్రతుకు కలిగెనేని భార్య కలదు' అంటూ బ్రతుకు పట్ల వ్యామోహంతోనే ఉంటారు మానవులు. బ్రతికుంటే బలుసాకు తిని బ్రతకవచ్చునంటారు. అయితే పై తెలుగు, బైబులు సామెతలు రెండూ ముక్తకంఠంతో దీనికి ప్రత్యామ్నాయ సత్యాన్ని ప్రతిపాదిస్తున్నాయి.

ఉన్నంతకాలం ప్రాణాలు నిలుపుకోవడమన్నది ప్రతి జీవిలోనూ ఉండే సహజ సంవేదన, శరీర ధర్మమున్నూ. పైన చెప్పిన సామెతలు కొంత వైరాగ్యభావనతో మరికొంత ఆధ్యాత్మిక చింతనతో పరమహంసలు పలికిన పలుకులని గ్రహించాలి.

నవరంధ్రాల కాయమిది. అరిషడ్వర్గపూరితమైన మనుగడ ఇది. క్షుత్తృష్ణాశోక మోహజరామరణ సమాహారమైన జన్మ ఇది.

'దార బందిగంబు తనయులు సంకెలల్
బంధువర్గమెల్ల ప్రహరిగోడ
మోహ మెరుగలేడు మొక్కలికాడయా'

అన్నాడు వేమన యోగి. భార్యయే చెరసాల, సుతులు సంకెళ్ళు, బంధువులు ప్రహరిగోడ. అజ్ఞానము చేత నరులు ఈ విషయాన్నెరుగలేకున్నారు. ఇహలోక పరమైన సుఖ సంతోషాలకంటే దైవ సాయుజ్యమే కడు వాంఛనీయం. ఈ సంగతి గ్రహించిన కుశాగ్రబుద్ధులు తమకంటె ముందు పరలోకగతులైన వారినుద్దేశించి ఈ సామెతలు ప్రయోగిస్తారు.

సత్యకాలం దాటిపోయింది. కలికాలం నడుస్తున్నది. మనుషుల్లో మమతలు, విలువలు అడుగంటుతున్నాయి. ఇకముందు మానవ నైజంలో ఎన్నెన్నో విపరీతాలు, భ్రష్టత్వాలు దర్శనమియ్యబోతున్నాయి. భూమాత కినుక వహించినదన్నట్టు ప్రకృతి వైపరీత్యాలెన్నో సంభవించనున్నాయి. రానున్న చెడు కాలాన్ని చూడవలసిన దుస్థితి లేకుండా ఇంతకు ముందే కాలం చేసినవారు ధన్యజీవులే కదా! బాధితులు ఆదరించేవారు కరువై దురపిల్లుతూ ఉంటారు. దుర్మార్గులు హద్దు అదుపు లేకుండా దిన దిన ప్రవర్ధమానమౌతూ పరపీడనా పరాయణులౌతుంటారు.

ఇవన్నీ కన్నులారా చూడనవసరం లేకుండా దాటిపోయినవారు హాయిగా రాగద్వేషాలకు అతీతంగా శరీర లంపటం వదిలించుకుని మరో లోకంలో మనుగడ సాగిస్తున్నారు. ఈ సామెతలను అంగీకరించడానికి కొంత ఆధ్యాత్మిక చింతన అవసరం.

## 16

తెలుగు సామెత : లోగుట్టు పెరుమాళ్లకెరుక

బైబులు సామెత : హృదయ రహస్యములను దేవుడెరుగును (కీర్తన 44:21)

అంతరంగం, బహిరంగమని రెండు పదాలు వ్యతిరేకార్థ బోధకాలుగా మనకు కనిపిస్తాయి. అంతరంగమంటే లోపలి భాగం (హృదయం). బహిరంగమంటే పైకి అందరికీ కనిపించే బాహ్య క్రియలు, బాహ్య ప్రపంచం. చాలామంది పైకి ఒక రకంగా కనిపిస్తారు, వినిపిస్తారు. లోపల ఇంకొక విధంగా పైకి చెప్పినదానికి పూర్తి వ్యతిరేకంగా ఉంటారు. పైకి చెప్పే మాటలు, చేసే చేష్టలు అందరికీ తెలుస్తాయి. లోపల ఉండే భావం ఈ లోగుట్టు భగవంతుడుకే తెలుస్తుంది గానీ మానవులకు తెలియదు. ఆ సందర్భాన్ని వివరించడానికి లోగుట్టు పెరుమాళ్ళకెరుక అనే ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

బైబులు సామెత కూడా దీనినే తెలియజేస్తుంది. పైకి చేసే క్రియలు, చెప్పే మాటలు మనకు తెలుస్తాయి గాని, హృదయాంతరాళంలో దాగి ఉన్న రహస్యం మనకెలా తెలుస్తుంది? అది దేవునికి మాత్రమే తెలుస్తుంది. ఒకని హృదయాలోచనలు రహస్యాలూ తోటి మానవుడు తెలుసుకోగలిగితే ఈ ప్రపంచం మరో విధంగా ఉండేది. అంతరంగ రహస్యాలు తోటివారికి తెలియవు గనుకనే మానవులు కొంత అదుపులో ఉన్నారనిపిస్తుంది. ఈ బైబులు సామెత కూడా 'లోగుట్టు పెరుమాళ్ళుకెరుక' అనే తెలుగు సామెత భావంతో ఏకీభవిస్తుంది.

సాధారణంగా లోగుట్టు, అంతరంగంలోని ఆలోచన, నిగూఢ భావన, మనుష్యులు ఎదుటివారికి చెప్పరు. పైకి అంతా ప్రశాంతంగానే ఉంటుంది. అంతరంగాల్లో హాలాహల కెరటాలు చెలరేగుతూ ఉంటాయి. సముద్రం పైకి నెమ్మదిగా ఉంటుంది. లోపల బడబాగ్ని శిఖలు నాల్కలు  చాస్తూ ఉంటాయి. ఇటువంటి పరిస్థితిని వివరించడానికి ఈ రెండు సామెతలు సమానార్థకంగా, సమర్ధవంతంగా పనిచేస్తాయి.

## 17

తెలుగు సామెత : శివునాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు

బైబులు సామెత : దైవచిత్తము కానిచో పిచ్చుకైనా నేల రాలదు (మత్తయి 10:29)

లోకమొక జూద క్రీడట. కాలపురుషుడు, కాళి అనే ఇద్దరు జూదరులు రేయింబవళ్ళనే పాచికలను దొరలిస్తున్నారట. ఒక గదిలో రెండు మూడు కాయలుంటే పాచిక విసిరాక అందులో ఒక్కటే మిగలవచ్చు. ప్రాణుల సంయోగ, వియోగాలకు వృద్ధి క్షయాలకు విధాతయే కర్త అని రూపించడానికి పండితులు గదులను గృహాలతో, కాయలను మనుజులతోను పోల్చి రసవత్తరంగా పై సామ్యం చెప్పారు. మనుషులు తామేదో నిర్వహిస్తున్నట్టు, కార్యభారం మోస్తున్నట్టు భ్రమిస్తారు గానీ కార్యాచరణ సంబంధపు పగ్గాలు సృష్టికర్త చేతిలో ఉన్నాయి. చీమ, పిచ్చుక వంటి అల్పప్రాణులను పేర్కొనడం ద్వారా తెలుగు, బైబులు సామెతలు రెండూ లోక సంభవాలన్నిటి కర్త, దర్శకుడు ఈశ్వరుడేనని నిరూపిస్తున్నాయి.

నరనారాయణులు కురుక్షేత్ర ధర్మక్షేత్రంలో శత్రువధకై సన్నద్ధులైన తరుణమది. కిరీటి శ్రీకృష్ణుని ఎదుట తన విషాదాన్ని వ్యక్తపరచగా భగవద్గీత దివ్యోపదేశం అతనికి అందింది. అతడు నిమిత్త మాత్రుడే. సృష్టి స్థితిలయాలకు కర్త జగన్నాథుడే.

కాగా క్రీస్తు స్వామి బోధనామృతమేమిటంటే ఒకడు కోరి ప్రయత్నించి తన ఎత్తు మూరడెక్కువ చేసికొనజాలడు. రేపేమి తినాలి, ఏమి ధరించాలి అని చింత వర్జించి సమస్తాన్నీ నిర్వహిస్తున్న పరమ జనకుని తలంచి నిశ్చింతగా ఉండడమే భక్తులకు తగినది. పర్వత ప్రసంగంగా వినుతికెక్కిన స్వామి ఉపదేశసారమిదే. 'ఆకాశ పక్షులను చూడుడి అవి విత్తవు, కొట్లలో కూర్చుకొనవు, అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు. మీరు వాటికంటె బహు శ్రేష్ఠులు కారా?' (మత్తయి 6:26)

'కంటి గంటి ననుచు కర్మాధికారంబు వెంటగొనుచు చెడును వెర్రిజనుడు' అంటాడు వేమన. అన్నీ తనకు తెలుసునంటూ కర్మాధికారం నెత్తిన వేసుకుని మిడిసిపడుతుంటాడు మనిషి. తత్త్వమెరిగి తన తాహతు తెలిసి ఘటనాఘటన సమర్థుడైన భగవంతునిపై భారముంచి జీవించడం సర్వోత్తమ మార్గమని ఈ సామెతలు సూచిస్తున్నాయి.

**మనుష్యుల జీవితాలను శాసించే నమ్మకాలు, విశ్వాసాలు అనేకం. దిక్కులేనివారికి దేవుడే దిక్కన్న దృఢ విశ్వాసంతో మనుగడ సాగించేవారు వేనవేలు. 'కొడుకు పుట్టాలి' అనే యావతో తపించిపోతారు కొందరు. ఎవరి కర్మకు వారే బాధ్యులని సరిపెట్టుకొంటారు మరికొందరు. నారుపోసినవాడు నీరు పోస్తాడనీ, దైవచిత్తం కాకుంటే పిచ్చుకైనా నేలరాలదనీ, నీటికి పల్లం తెలిసినట్లే నిజం దేవునికెరుకనీ ప్రగాఢ విశ్వాసంతో సంతోషంగా బ్రతుకు వెళ్ళదీసేవారిని ఈ సామెతలు పరామర్శిస్తున్నాయి.**

# రెండవ భాగం:

## తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం

## 5. తెలుగు, బైబులు సామెతలు: స్త్రీ

# 5. తెలుగు, బైబులు సామెతలు: స్త్రీ

సామాజిక, కౌటుంబిక జీవితాలలో స్త్రీకి ముఖ్య స్థానమున్నది. తల్లిగా, తోబుట్టువుగా, భార్యగా, బిడ్డగా ఎన్నో రూపాలలో జీవించి మరెన్నో అనుభూతులకు కారణమయ్యే స్త్రీమూర్తి సామెతలలో ప్రఖ్యాత వస్తువు. అందువలన స్త్రీలకు సంబంధించిన సమానార్థక తెలుగు, బైబులు సామెతలను ఈ అధ్యాయంలో పరిశీలిద్దాం.

అయితే సేకరించిన స్త్రీ సంబంధిత తెలుగు, బైబులు సమానార్థకమైన సామెతలలో వెలయాలు, వారకాంతల గురించి వాడుకలో ఉన్న సామెతల సంఖ్యతో సాధ్వుల గురించిన సామెతలు సరితూగడం లేదు. ఆడదాని అపర బుద్ధి, అవివేకం గురించి, తలవంపులు తెచ్చే భార్యలు, కుమార్తెల గురించి ఉన్నంత పుష్కలంగా ఇంటికి దీపంగా భాసిల్లే ఇల్లాళ్లను గురించిన సామెతలు లేవు. ఇది విచారించదగినది. పరిశీలనలో ఉన్న రెండూ పురుషాధిక్య సమాజాలు కావడం బహుశః దీనికి కారణం కావచ్చు.

**1**

తెలుగు సామెత : అంకెకు రాని ఆలిని ఆర్గురి బిడ్డల తల్లయినా విడవాలి

బైబులు సామెత : మాట వినని భార్యకు విడాకులిమ్ము (సీరా 25:26)

తెలుగు, బైబులు సామెతలలో తెలుగువారి నోట నిత్యం నానుతూ ఉండే గద్య పద్య సాహిత్యాలలో మగనాలి గురించిన ప్రస్తావనలు కోకొల్లలు. మానవ సంబంధాలలో ఆలుమగల బంధం అత్యంత విలక్షణమైనది. తల్లి కడుపున పుట్టిన మగవాడు రెండవసారి కుమారునిగా తన భార్య కడుపున పుడతాడు అని వేమన భాష్యం. భార్య తన భర్తను గౌరవ మర్యాదలనిచ్చి మన్నించటమనేది వివిధ కారణాలపై ఆధారపడి ఉంటుంది. 'కలిమి లేని మగడు కాసు విలువ చేయడు' అన్నదీ వేమన్న వాదమే.

ఇల్లాలు సహధర్మచారిణియై, భర్త అదుపాజ్ఞలలో అనుకూలవతియై గృహలక్ష్మిగా శోభిల్లాలని, ఏ మగడైనా కోరుకుంటాడు. ఆ సాధ్వికి పుట్టినింట్లో, మెట్టినింట్లో

మన్నన, మర్యాద లభిస్తాయి. పెడసరియై పెంకెతనంతో ఎడ్డెమంటె తెడ్డెమన్నట్టుగా భర్త పరువు పోయే చందాన ప్రవర్తించే స్త్రీ చెప్పులోని రాయి వంటిది, చెవిలోని జోరీగ వంటిది. కంట్లో నలుసు, కాలిలో విరిగిన ముల్లు వలె అలాటి మగువ వలన బాధలు దుర్భరం.

గయ్యాళియైన భార్యతో మేడల్లో, మిద్దెల్లో కాపురముండడం కన్నా అణకువ గల స్త్రీతో ఒక మూలన నివసించడం మేలని పెద్దలంటారు. వేమన సైతం ఈ సామెతలతో ఏకీభవిస్తూ

'విడువ వలయు నూరు విశ్రాంతిగాకున్న
విడువ వలయు నాలి విధము చెడిన
విడువ వలయు రాజు వితరిణి గాకున్న'

అని అభిప్రాయపడ్డాడు. భార్య చేసే చెడుగు భర్తకు తప్పక సంక్రమిస్తుంది. భార్య పోకిరీ అయితే నలుగురూ ఆమె భర్తను నిందిస్తారు. ఇలా వివిధ కారణాల మూలంగా యోగ్యురాలు కాని సతిని వర్జించడం మేలని ఈ బైబులు, తెలుగు సామెతలు ఉద్బోధిస్తున్నాయి.

భర్త సంపాదనపైనే దృష్టి నిలిపి, మగని కష్ట సుఖాలలో పాలు పంచుకొనక తలవంపులు, మనస్తాపం కలిగించే మగువను అదుపులోకి తెచ్చుకోవడం సాధ్యపడకుంటే ఆమెను విసర్జించడమే ఉత్తమమని చెప్పే ఈ సామెతలు పురుషాధిక్య సమాజంలో పుట్టినవి. స్త్రీ పురుషులకు సమాన గౌరవ సన్మానాలు లభించే ఆధునిక సమాజంలో పరస్పర ప్రేమానురాగాలతో ఘర్షణలను నివారించుకొంటూ కలిసి కాపురం చేయడమే సత్పురుషుల విధి.

## 2

తెలుగు సామెత : అదుపుకు రాని ఆలిని, అందిరాని చెప్పును విడువమన్నారు

బైబులు సామెత : గయ్యాళితో పెద్ద ఇంటనుండుట కంటె మిద్దెమీద ఒక మూలన నివసించుట మేలు (సామెతలు 25:24)

"తిరిగే కాలు, తిట్టే నోరూ ఊరుకోవు" అనేది అనుదిన జీవితంలో అందరెరిగిన నానుడి. మానవుడు ప్రశాంతంగా జీవించాలే గాని, అలజడితో, సాధింపులు, వేదింపులతో మనుగడ సాగించలేడు. అందుకే ఇంటిలోని పోరు ఇంతింత కాదయా అంటారు. గయ్యాళితనం ఒక రకమైన క్రూరత్వమని కొందరు భావిస్తారు. నోటి మాటల చేత అయినదానికీ, కానిదానికీ చిర్రుబుర్రులాడడం ఆరోగ్యకరమైన అలవాటు కాదు. గయ్యాళితో కాపురం, ఎడతెగక కారుతున్న చూరు నీళ్ళక్రింద నివాసం ఒకటేనని విజ్ఞుల అభిప్రాయం. అటువంటి సాంసారిక జీవితం కంటే సన్యాసిగా, ఏకాకిగా బ్రతకడం మేలనిపిస్తుంది. ఇటువంటి గయ్యాళివారిని దృష్టిలో పెట్టుకునే "సన్యాసి సుఖి, సంసారి దుఃఖి" అని పూర్వులు సాదృశ్యంగా మాట్లాడి ఉంటారు. భార్య దొరికిన వారికి మేలు దొరికినట్లని, గుణవతియైన భార్య ముత్యముకంటే విలువైనదని బైబులు తెలియజేస్తున్నది. అయితే భార్య గుణహీనయై, గయ్యాళియై వేదిస్తూ ఉంటే అటువంటి అర్ధాంగిని విడిచిపెట్టి ఏకాకిగా బ్రతకడమే మంచిదని ఈ బైబులు సామెత నొక్కి వక్కాణిస్తుంది. స్త్రీలు అణకువ, వినయ విధేయతలు కలిగి ఉండాలి. ఆ విధంగా లేకపోతే, విచ్చలవిడితనం, గయ్యాళితనం ఉంటే భర్త ఒక్కడే కాదు, అసలు సంసారమే చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉంది. కనుక స్త్రీలు గయ్యాళితనం విడిచిపెట్టి, మితభాషిణులై, సహజ లావణ్య సౌకుమార్యాలు కలిగి ఉంటే పురుషులు అలాంటి స్త్రీల పట్ల అనురాగబద్ధులై జీవిస్తారు. గద్దరితనాన్ని విడనాడకపోతే, పురుషుడే గయ్యాళి భార్యను విడనాడిపోతాడనేది నగ్నసత్యం!

తెలుగు సామెత కూడ అదుపునకు రాని ఆలిని, అందిరాని చెప్పును వదలివేయాలని ఉద్బోధిస్తున్నది. ఆలి అదుపులో ఉండి అన్ని విషయాలలో సహధర్మచారిణిగా ఉంటే, దాంపత్య జీవితం ఆనందమయమవుతుంది. భర్తకు లోబడకుండా, అతగాడిని శాసించాలనే ఆధిక్యతను ప్రదర్శిస్తే స్త్రీ నష్టపోతుంది. భార్య భర్తకు చేదోడువాదోడుగా ఉండాలే గాని, అందిరాని చెప్పులాగా, అగ్నిలో వేసిన ఉప్పులాగా ఉండకూడదు.

కాలికి చెప్పు తగిలి వస్తేనే అది రక్షగా, అందంగా ఉంటుంది. తగిలి రాకపోతే చెప్పులు మార్చవలసిందే. ఆలి అదుపులో ఉంటేనే అందంగా ఔచిత్యంగా ఉంటుంది. అదుపు తప్పితే వదిలివేయవలసిందే. గయ్యాళి భార్యతో కాపురం చేయడం కంటే, ముక్కు మూసుకొని కారడవులలో తపస్సు చేసుకోవడం మేలు. అదుపుకు రాని భార్యను, అందిరాని చెప్పును వదలివేయడం ఉత్తమం!

## 3

తెలుగు సామెత : ఆకలి రుచి ఎరుగదు, నిద్ర సుఖమెరుగదు, కోరిక సిగ్గు ఎరుగదు

బైబులు సామెత : వ్యభిచారిణికి సాహసము మెండు. సిగ్గులేదు, ఇంటిలో కాలు నిలువదు (సామెతలు 7:11)

కామం (కోరిక) సిగ్గు ఎరుగదంటున్నది పైని పేర్కొనిన తెలుగు సామెత. దానిని ఈ సామెత మరో రెండు సత్యాలతో బలపరుస్తున్నది. కామంతో కళ్ళు మూసుకు పోయినవారికి భయంకాని, లజ్జ (సిగ్గు) కాని ఉండవంటుంది ఒక సంస్కృత లోకోక్తి. దీనికి ఉదాహరణలు అనునిత్యం మనం వార్తాపత్రికల్లో చూస్తూనే ఉన్నాం. కామాంధులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ చేస్తున్న లజ్జా విహీన కృత్యాలు గమనిస్తూనే ఉన్నాం.

బైబులు సామెత కామాతుర అయిన ఒక స్త్రీని గురించి చెబుతున్నది. ఆమె సిగ్గూ, బిడియం, భయం లేకుండా వీధి వీధిలో తిరిగి ఏ విధంగా తన వాంఛాపరిపూర్తి కోసం పరితపిస్తుందో వివరిస్తున్నది. "కామాతురాణాం నభయం, నలజ్జా" అనే అర్థాలు బైబులు సామెతలో కార్యరూపాలయ్యాయి. విరహిణులైన స్త్రీలు బరితెగించి పాల్పడిన అకృత్యాలకు అటు బైబులులోనూ, ఇటు మన సాహిత్యంలోనూ, చరిత్రలోనూ కూడా కోకొల్లలుగా ఉదాహరణలు కనిపిస్తాయి. బైబులులో యోసేపును వలలో వేసుకోవాలని ఆత్రపడిన ఈజిప్టు వగలాడి ఈ సందర్భంలో మనస్సుకు చటుక్కున స్ఫురిస్తుంది (ఆదికాండము 39:1-20). సారంగధరుని పతనాన్ని శాసించిన చిత్రాంగి కూడా ఈ కోవలోనిదే. పురాణాలలో అహల్యను మోహించిన దేవేంద్రుడు, బైబులులో తన చెల్లెలి వరసైన తామారుపై మోజుపడి ఆమె అన్న అబ్షాలోము చేతిలో హతుడైన అమ్నోను కూడా (సమూవేలు రెండవ గ్రంథము 13:11-30) ఇలాటివారే.

కావున కామాన్ని అదుపులో ఉంచుకోవాలని ఈ రెండు సామెతలూ చెప్పకనే చెబుతున్నాయి.

## 4

తెలుగు సామెత : ఆడదాని బుద్ధి అపరబుద్ధి

బైబులు సామెత : ఆమె జీవమార్గమున నిలువక చపలచిత్తముతో ఎక్కడెక్కడికో తిరుగును (సామెతలు 5:6)

సాధారణంగా ప్రపంచ చరిత్రలో కాంతా కనకాల కోసమే సమస్త యుద్ధాలూ జరిగాయి. వినాశనాలు చోటుచేసుకున్నాయి. స్త్రీ కారణంగా అనేక అకార్యాలు ఈ ఆధునిక యుగంలో కూడా జరుగుతున్నాయి. ఇనుప కచ్చడాలు కట్టుకున్న వీరులైనా ఆడదాని ఓరచూపులో పడి లేవలేక అల్లాడి పోవలసిందే. పురాణాలలో విశ్వామిత్రుడు రాజర్షి. అతడు మేనక మేని బంధంలో చిక్కుకుని అటు స్వర్గానికి, ఇటు రాచరికానికీ దూరమై, రెంటికీ చెడిన రేవడైనాడు. తపస్సు చేసి, మహత్తర శక్తులు, మహర్దశను పొందాలనుకున్న ప్రతివాని మీదికీ అప్సర స్త్రీని ఆయుధంగా పురాణాలలో ఇంద్రుడు ప్రయోగించడం జగమెరిగిన సత్యమే. అందుకే ‘అల్లుని మంచితనము, గొల్లని సాహిత్య విద్య, తెల్లని కాకులు ఎలాగైతే ఉండవో, కోమలి మంచితనం కూడా గగనకుసుమమేన’ ని సుమతీ శతకకర్త చెప్పాడు. ఈ నేపథ్యం నుండి పురుషాధిక్య సమాజాలలో పుట్టినవాటిగా పై సామెతలను అర్థం చేసుకోవలసి ఉంటుంది. కారణాలు ఏమైనా స్త్రీల పట్ల పురుషులకుండే హైన్య, అభద్రతా భావాలు ఈ సామెతలలో స్పష్టంగా తెలుస్తున్నాయి.

## 5

తెలుగు సామెత : ఆడపిల్ల పెళ్ళి, అడుగు దొరకని బావి అంతం చూసేవే
ఆశ్వమేథం చేయవచ్చు గానీ ఆడపిల్ల పెళ్ళి చేయలేము

బైబులు సామెత : ఆడబిడ్డ పుట్టుట వలన కష్టమే కలుగును (సీరా 22:3)

లింగ వివక్ష భారతీయ సమాజం నరనరాలలో జీర్ణించుకుపోయిందనేది నిర్వివాదాంశం. ఆడపిల్లను కని పెంచడంలోని సాధకబాధకాల మాటెలా ఉన్నా సగటు గృహస్థుకి ఆడపిల్ల పెళ్ళి చేయడం అశ్వమేథం చేయడం కన్నా కష్టం. తెలుగు సామెతలు ఆడపిల్ల వివాహం గురించి ప్రస్తావిస్తుంటే, బైబులు సామెత మొత్తంగా

ఆడపిల్లను కనిపెంచడం గురించి వ్యాఖ్యానిస్తున్నది.

ఆడపిల్ల ఆడపిల్లే గానీ ఈడపిల్ల కాదు అంటారు. అంటే ఆడపిల్ల ఏనాటికైనా అక్కడికి (అత్తవారింటికి) పోవలసిన పిల్లే గాని ఇక్కడ (పుట్టింట్లో) ఉండిపోదు. యుక్తవయసు వచ్చిన నాటి నుండి కుమార్తె ఆ తండ్రికి గుండెలపై కుంపటిలా అనిపిస్తుంటుంది. పదహారేళ్ళ ప్రాయం దాటితే అమ్మాయికి పెళ్ళి చెయ్యరూ అని ఆరా తీసే శ్రేయోభిలాషులు ఎక్కువవుతారు. ఇల్లు కట్టి చూడు, పెళ్ళి చేసి చూడు అన్న చందాన దిగితే గానీ తెలియదు లోతు.

ఆడపిల్ల పెళ్ళి అనగానే కట్టెదుట ప్రత్యక్షమయ్యే పెనుభూతం వరకట్నం. పెండ్లి కొడుకు గొంతెమ్మ కోర్కెలు కోటలు దాటుతుంటాయి. రొక్కం, వస్తువులు కాక కోకొల్లలుగా లాంఛనాలు, పెట్టిపోతలు పుంఖానుపుంఖాలుగా వచ్చిపడతాయి. ఇన్ని ముడుపులు ఒక పక్క సమర్పించుకొంటూనే మగ పెళ్ళివారికి అణిగిమణిగి ఉంటూ వారి అడుగులకు మడుగులొత్తాలి. అమ్మాయి మెడలో పుస్తెలు పడ్డాయిలే అని సంతోషిస్తుంటే పెళ్ళి కొడుకు అలకపాన్పు తంతు ఉంటుంది. మరిన్ని కోరికల జాబితా సిద్ధం. ఇంట్లో కామధేనువో, కల్పవృక్షమో ఉంటే తప్ప పెళ్ళి చేసి నెగ్గించుకు రాలేని పరిస్థితి కన్యాదాతది.

కన్యాశుల్కం ఆనవాయితీగా ఉన్న రోజులు గతించాయి. అడిగినంత కట్నానికి తూగలేక ఇల్లు వొళ్ళు గుల్ల చేసుకొంటూ కుటుంబాలు చితికిపోవడం నేడు సర్వసాధారణం. అంతటితో కథ ముగిసిందనుకుంటే పొరపాటే. పండుగలు, పబ్బాలు, పురుళ్ళు, అనారోగ్యాలూ అన్నిటి భారం అమ్మాయి తండ్రే మోయాలి. డబ్బు అవసరమైనప్పుడల్లా అల్లుడు గారికి మామగారే సర్దుబాటు చెయ్యాలి. లేకుంటే కూతురు  వచ్చి పుట్టింట్లో తిష్ఠ వేస్తుంది.

కొన్ని సమాజాలలో ఆడపిల్లకు పెళ్ళి చేసి ఒక అయ్య చేతుల్లో పెట్టేవరకు భద్రంగా కాపాడడమే కష్టం. కళ్ళల్లో వత్తులు వేసుకుని అనేక విధాల జాగరూకతతో కాపాడుకోవాలి. అందుకే గతంలో బాల్య వివాహాలుండేవి. ఈ పిల్ల ఫలానా వ్యక్తి భార్య అంటే ఆమెకు కొంతైనా రక్ష.

ఆడపిల్ల పుడితే లక్ష్మీదేవి పుట్టిందని సంబరపడడం, ఆడపిల్ల ఘల్లుఘల్లున నట్టింట్లో నడయాడుతుంటే చూచి  మురిసిపోవడం మన సంప్రదాయం. అయితే

స్థూలంగా ఆడపిల్ల పెంపకం, పెండ్లి తంతు తదనంతరం ఉండబోయే అవాంతరాలను ప్రతిబింబిస్తూ ఈ సామెతలు పుట్టాయి. ఆడబిడ్డల సాధికారికత, ఆర్థిక స్వావలంబన, మొత్తంగా సమాజంలో చైతన్యం ఈ ధోరణిని పరిష్కరించడానికి దోహదం చేస్తాయి.

## 6

తెలుగు సామెత : ఇంటికి దీపం ఇల్లాలు

బైబులు సామెత : మంచి ఇల్లాలు తాను తీర్చిదిద్దుకొనిన ఇంట వెలుగొందు చుండును (సీరా 26:16)

న్యాయమో, అన్యాయమో గానీ నిర్ణయాధికారాలు, ఆర్థిక సాధికారికత లేకున్నా ఒక ఇంటి ఉత్థానపతనాలకు ఇంటి ఇల్లాలునే బాధ్యురాలుని చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. 'కోడలొచ్చిన వేళా విశేషం' అంటూ ఇటీవల తమ ఇంట్లో జరిగిన శుభాలకు ఆమెదే మహత్తు అంటూ మురిసిపోతారు పెద్దలు. అరిష్టాలు వాటిల్లితే "ఈ మహాతల్లి ఏ ముహూర్తాన ఇంట్లో కాలు పెట్టిందో గాని ..." అంటారు. గుట్టుగా కాపురం చేసుకొంటోంది అనే మాట కూడా వాడుకలో ఉంది. ఒద్దికైన సంసారం స్థూలంగా అర్థాంగి బాధ్యతేనని ఒప్పుకోక తప్పదు.

ఇంటికి దీపం ఇల్లాలే అన్నది తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైన సామెత. అలానే ఇల్లు చూచి ఇల్లాలిని చూడు అన్నది కూడా. బైబులు సామెత దీనితో నూటికి నూరు శాతం ఏకీభవిస్తూ నట్టింట వెలిగించిన దీపకళికలా గృహణి భాసిల్లుతుందని సెలవిస్తున్నది.

తెలుగు, బైబులు సామెతలు ముఖ్యంగా ప్రతిపాదించేది ఒక ఇల్లాలు తన ఇంటిని తీర్చిదిద్దుకొనే తీరును గురించి. అష్టైశ్వర్యాలూ ఉన్న గృహసీమల్లో సైతం గృహిణి సోమరియై పనివాళ్ళ మీద ఇల్లు వదిలివేసి పెత్తనాలకు పోతే ఇల్లు అస్తవ్యస్తమవు తుంది. పేద ఇంట్లో ఉన్నదానిలో ఒద్దికగా ఇల్లు అలికి ముగ్గులేసి వాకిట కళ్ళాపి చల్లి ఎక్కడ ఉండవలసిన వస్తువు అక్కడ ఉండేలా సర్దుకొని, శుభ్రమైన చీరెలో చిరునవ్వుతో దర్శనమిచ్చే ఇల్లాలు ఇంటికే శోభనిస్తుంది. వేకువజామునే లేచి పిల్లాపాపలకు అన్నీ సమకూర్చి, భర్తను సాదరంగా పనికి సాగనంపి తీరిక వేళలో ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ ఇరుగూ పొరుగుకు చేయూతనిస్తూ అతిథి

అభ్యాగతులను ఆదరిస్తూ ఉండే స్త్రీని నిజంగానే మా ఇంటి గృహలక్ష్మి అని ఇంటిల్లపాదీ కొనియాడుతారు. బైబులు సామెతల గ్రంథంలో 31వ అధ్యాయమంతా ఆదర్శ గృహిణి లక్షణాలనే వర్ణిస్తుంది.

ఇల్లాలు భక్తితత్పరతల కలిగినదైతే ఇల్లంతా పూజాదికాలతోను, ప్రార్థనలతోను ప్రతిధ్వనిస్తుంది. చేతికి ఎముక లేనిదైతే నిర్భాగ్యులకు, అన్నార్తులకు ఆ గృహం అన్నపూర్ణ అవుతుంది. ఆమె పైలా పచ్చీసు ధోరణిలో వినోద విలాసాల పట్ల మోజు కలదైతే ఆ ఇల్లు క్లబ్బులా అవతరిస్తుంది. సంపాదించేది ఒకవేళ కేవలం మగవాడే అయినా ఇంటిని తీర్చిదిద్దడంలో అతని పాత్ర స్వల్పమే. అందుకే ఇల్లాలు తన మమతానురాగాలతో శ్రద్ధతో తీర్చిదిద్దుకున్న స్వర్గసీమ వంటి గృహంలో దేవి వలె అలరారుతుంది అని ఈ సామెతలు తెలుపుతున్నాయి.

## 7

తెలుగు సామెత : ఇల్లు చూచి ఇల్లాలిని చూడు

బైబులు సామెత : వివేకవంతులైన ఉవిదలు గృహములను నిర్మింతురు
(సామెతలు 14:1)

బైబులు సామెత వివేకవంతులైన ఇల్లాండ్రను గూర్చి వారి ఇళ్ళను గూర్చి తెలియజేస్తుంది. ఇంటిని కట్టడానికి, పడగొట్టడానికి ఇల్లాలే కారణం. గృహిణి వివేకవంతురాలై, జ్ఞానవంతురాలై విద్యావతియై ఉంటే ఇల్లు కట్టబడుతుంది. ఆమె తన ఇంటిని నిలుపుకుంటుంది. గృహిణి మూర్ఖురాలై, గయ్యాళిగా, అవివేకిగా ఉంటే ఇల్లు నాశమౌతుంది. అంటే ఆమె చేతులతో ఆమే తన ఇంటిని పడగొట్టుకుంటుంది.

'ఇల్లు చూచి, ఇల్లాలిని చూడు' అనేది తెలుగు సామెత. ఒక ఇంటి అందచందాలు, శుచీశుభ్రతలూ, అమరిక, పొందికలు, ఆ గృహిణి మీద ఆధారపడి ఉంటాయి. ఏ వస్తువు ఎక్కడ పెట్టాలో, ఏ పాత్రని ఏ విధంగా నిలపాలో, ఏ ఆసనాన్ని ఎక్కడ వేయాలో ఆలోచించి అన్నీ సముచిత స్థానాల్లో అమర్చేది ఇల్లాలు. కనుక ఇంటిని చూస్తే ఇల్లాలి శక్తి సామర్థ్యాలు అవగతమవుతాయి. ఈ విధంగా ఈ తెలుగు, బైబులు సామెతలు ఏకార్థాన్ని ఏకరవు పెడుతున్నాయి. ఇంటిలో ఇల్లాలి పాత్రను కళ్లకు కడుతున్నాయి.

## 8

తెలుగు సామెత : ఉల్లి మల్లి అవుతుందా? ఉంచుకున్నది పెళ్ళామవుతుందా?

బైబులు సామెత : కుమారా, నీవు పర స్త్రీ వ్యామోహమున తగుల్కొనేల? అన్య స్త్రీ ఆలింగనమున పరవశుడవు కానేల? (సామెతలు 5:20)

వ్యభిచరించవద్దు అనేది బైబులులోని పదియాజ్ఞలలో ఒకటి. పర స్త్రీ వ్యామోహం ప్రతివారినీ నాశనం చేస్తుంది. ఇది పాప కార్యమని అందరికీ తెలుసు. అయినా గొప్ప గొప్ప వారెందరో ఈ వ్యామోహంలో పడి భ్రష్టులయ్యారు. అసలు సమాజంలో జరిగే క్రూరకృత్యాలన్నీ కాంతాకనకాల కోసమేనని చెబితే మనం ఆశ్చర్యపోనవసరం లేదు. విజ్ఞాన ఖనియైన సొలొమోను మహారాజు జార స్త్రీ పెదవుల నుండి తేనె వర్షిస్తుందని, దానివల్ల వచ్చే ఫలం మాత్రం కాలకూట విషం వంటిదని వివరించాడు.

ఇది మగవారందరికీ అత్యాకర్షణీయమైన విషయం. ఎంత ఆకర్షణీయమో, అంతటి పాపహేతువు కూడా. పూర్వకాలంలో ఈ వ్యభిచారం యధేచ్ఛగా సాగింది. ఇప్పుడు కూడా ఇది వెర్రితలలు వేస్తూ, అనేక దుష్ఫలితాలకు దారితీస్తున్నది.

ఇది మగవారికొక్కరికే కాదు, ఆడవారికి కూడా నిషేధమే. తప్పు ఎవరు చేసినా తప్పే. దాని ఫలితం ఎవరికైనా సమానమే. పరస్త్రీ వ్యామోహం పురుషులకు శ్రేయోదాయకం కానట్లే, పర పురుష వ్యామోహం స్త్రీలకు కూడా శ్రేయోదాయకం కాదు.

అసలు స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ సహజసిద్ధమైనది. సంతానాభివృద్ధికి, వంశాభివృద్ధికి ఇది అత్యవసరమైనది. ప్రతి పురుషునికి స్వంత స్త్రీ (భార్య) ఉండాలి. ప్రతి స్త్రీకి స్వంత పురుషుడు (భర్త) ఉండాలి. వివాహ వ్యవస్థ సమాజంలో ఏర్పడిన తరువాత ఈ పరస్పరాకర్షణ భార్యా భర్తలలో క్రమబద్ధీకరింపబడి కుటుంబ వ్యవస్థకు మూలసూత్రంగా నిలిచిపోయింది. వివాహం అన్ని విషయాలలో గొప్పదని బైబులు తెలియజేస్తుంది. ప్రథమ వివాహం సర్వేశ్వరుడే చేశాడు. అంటే బైబులు ప్రకారం మానవుడెంత పురాతనుడో, వివాహం కూడా అంత పురాతనమైదన్నమాట.

ఇక తెలుగు సామెత ఉల్లి మల్లి కాదని, ఉంచుకున్నది పెళ్ళాం కాదని వివరిస్తున్నది. భార్యకు సహధర్మచారిణి అని మరొక పేరు. ఆమెకు భర్తలో సగభాగం ఉంది. ఈ హక్కు వివాహం ద్వారా సంక్రమించి, సంతానప్రాప్తితో సుస్థిరమవుతుంది.

ఆమె కుమారులకు మరలా పెళ్ళి చేసి కోడలిని తెచ్చుకొని, వారి వైవాహిక జీవితం ద్వారా వంశవృక్షాన్ని అభివృద్ధి చేసుకొని కుటుంబాలను విస్తరింపజేసుకుంటుంది. అర్థాంగికి అన్నింటిలోనూ హక్కు ఉంది. అయితే ఉంచుకున్న ఉంపుడుగత్తెకు ఇటువంటి హక్కులు లేవు. పరస్త్రీకి కులస్త్రీకి ఉన్న అన్ని హక్కులు సంక్రమించవు. అందుకే ఉంచుకున్నది పెళ్ళాము కాదని తెలుగు సామెత తెలియజేస్తుంది.

ఉల్లికి పూలు పూస్తాయి. అవి ఆకారంలో మల్లెలవలె కనిపించినా సుగంధాన్ని విరజిమ్మడంలో మల్లెలకు సాటిరావు. ఆకారం ఒకటిగా ఉన్నంతమాత్రాన గుణగణాలు ఒకటిగా ఉండవు కదా. అందుకే ఉల్లి మల్లి కాదనే సామెత ప్రాచుర్యంలోకి వచ్చింది. కాకి, కోకిలా ఒకే గూటిలో పెరుగుతాయట. ఆకారం కూడా కొంచెం ఇంచుమించుగా చిన్నతనంలో ఒకే రకంగా ఉంటుందట. అయితే కాకి నోరు విప్పితే కర్ణకఠోరంగానూ, కోకిల కంఠం మధురాతి మధురంగానూ ఉంటుంది. కాబట్టి కాకి కోకిల కాదు. వెలయాలు ఇల్లాలు కాదని చెబుతారు.

ఎంత చర్చించినా పరస్త్రీ పొందు అనర్థదాయకం. వెలకాంత కులకాంత కానేరదు. పరస్త్రీ ఆలింగనానికై పరుగెత్తేవాడు పాతాళకూపానికి పరుగెత్తేవాడని బైబులు తెలియజేస్తుంది. పరస్త్రీ భార్య కాజాలనట్లే, ఉల్లిపువ్వు మల్లెపువ్వు కాజాలదు. ఈ పరస్త్రీ వ్యామోహం వ్యక్తిగత జీవితంలోను, కౌటుంబిక, సాంఘిక జీవితాలలోను అక్రమాన్ని సృష్టించి అలజడిని పాదుకొల్పుతుంది. దీనివల్ల నేడు అనేక భయంకమైన రోగాలు పుట్టుకొస్తున్నాయి. 'ఎయిడ్స్' అనే భయంకర వ్యాధి పరస్త్రీ, పర పరుష వ్యామోహాల వల్ల ప్రభవించిందే. దీనికింతవరకు ఔషధం లేదంటే సమాజ స్థితి ఎంత ప్రమాదభరితంగా ఉందో గమనించవచ్చు.

"పరకాంతా వ్యామోహము
కర చెన్ పెను పాముమాడ్కి కలియుగ పురుషున్
చిరు ప్రాయమందె తన సుం
దర దేహము బుగ్గికాక తప్పునె జననీ"

యని ఒక ఆధునిక కవి ఆవేదన. కనక పరస్త్రీ వ్యామోహంలో పడరాదు. పరస్త్రీ ఆలింగనం ఆశింపరాదు. ఉల్లి మల్లి కాదు, ఉంచుకున్నది ఆలి కాదు. ఈ సామెతల సారాంశాన్ని జాగ్రత్తగా అవగతం చేసుకొని జీవించి, ప్రపంచాన్ని ప్రమాదాల నుంచి తప్పించవలసిన బాధ్యత ప్రతి వ్యక్తి మీదా ఉంది.

## 9

తెలుగు సామెత : ఒక్కతే కూతురని వరి అన్నం పెడితే, మిద్దెనెక్కి మిండగాళ్ళను పిలిచిందట

బైబులు సామెత : పొగరుబోతు పడచు తండ్రికి తలవంపులు తెచ్చును (సీరా 22:5; 26:10-12)

ఇది పల్నాడు, రాయలసీమల్లో వ్యవహారంలో ఉన్న సామెత. జొన్నలు, సజ్జలు ముఖ్యాహారంగా ఉండే మెట్ట ప్రాంతాలలో పూర్వం వరి అన్నం అరుదైన ఆహారం. "నాగులేటి నీళ్ళు, నాపరాళ్ళు, సజ్జ జొన్నకూళ్లు, సర్పంబులును తేళ్ళు" అంటూ శ్రీనాథ కవి వర్ణించిన ఈ ప్రాంతాలలో వరి అన్నం సంపన్నుల ఆహారం.

కుమార్తె ఆ తండ్రికి ప్రాణప్రదం. అందులోనూ ఒక్కతే కూతురాయె. ముద్దు మురిపాలతో వరి అన్నం వండించాడు. అద్దాలనాడు బిడ్డలు గానీ గడ్డాలనాడా? అన్నట్టుగా ముక్కుపచ్చలారని పసికూనగా ఆ పాపను ఎంచి తండ్రి మురిసిపోతుంటే ఆ యువతిలో యవ్వన సహజమైన కోర్కెలు ముప్పిరిగొంటున్నాయి. ఈ నేపథ్యం నుండి పుట్టి ఉంటుంది ఈ తెలుగు సామెత. వికారాలు ప్రకోపించిన యువతుల విపరీత బుద్ధులు ఈ తెలుగు సామెతలో కనిపిస్తున్నాయి.

కన్నెపిల్లల హద్దు అదుపు లేని ప్రవర్తన మూలంగా కన్నవారికి తలవంపులు వస్తాయన్న సత్యం బైబులు సామెతలో బహిర్గతమవుతున్నది. తరుణ వయసులో, మధురోహాలతో, ఉండే పడుచులు హద్దుల్లో ఉన్నంతవరకు అందరి కన్నుల పంటగా ఉంటారు. కోరికలు గుఱ్ఱాలై వికటించి ఆగడాలకు తెగబడితే ఆ పిల్ల తుళ్లింతలు చూచి అందరూ తండ్రిని ఆడిపోసుకుంటారు. ఆ జవరాలు మరింత హద్దుమీరి కాలుజారిందంటే ఆ కుటుంబమంతటికీ అది మాయని మచ్చ అవుతుంది. పురుషాధిక్య సమాజంలో తనయుడు అల్లరిచిల్లరగా తిరిగినా కొంతవరకు ఫర్వాలేదు గానీ ఆడ కూతురిపై ఎలాటి అపనింద పడినా ఆ కుటుంబం తలెత్తుకోవడం కష్టం.

ఆడపిల్లలు నవ్వుతూ తుళ్ళుతూ ఉండవలసిందే గానీ, పొగరుబోతులుగా ప్రవర్తిస్తూ అన్నిటికీ మించి నీతి బాహ్యంగా మెలిగి నలుగురి నోళ్ళలో నానడం అనేది తండ్రిని, కుటుంబమంతటినీ నవ్వులపాలు చేస్తుంది అని ఈ సామెతలు తెలుపుతున్నాయి.

## 10

తెలుగు సామెత : కళ్లు మూసుకొని పాలు త్రాగుతూ పిల్లి తననెవరూ చూడలేదను కొనునట్లు

బైబులు సామెత : వ్యభిచారిణి చీకటి తప్పుచేసి ఒడలు కడుగుకొని నేనేమి పాపము చేయలేదనుకొనును (సామెతలు 30:20)

బైబులు జ్ఞాని, 'నా బుద్ధికి మించినవి, నేను పసిగట్టలేనివి మూడు ఉన్నాయి' అంటున్నాడు. అవి : అంతరిక్షంలో పక్షి జాడ, బండమీద పాకి వెళ్ళిన సర్పం జాడ, నడిసంద్రాన ఓడ వెళ్ళిన జాడ. వీటన్నిటికంటే మర్మమైనది జారిణి చర్య. చేయ వలసినది చేసి కడుగుకొని నాకేపాపం తెలియదదంటుంది. పాలు చూడగానే ఒళ్ళు మరచి గబగబా తాగేస్తూ తననెవరూ చూడడం లేదనుకునే పిల్లి చందమే ఇది.

మగడెంత మంచివాడైనా మన్మథుడైనా జారిణి తన సహజ గుణం మానదు. తన రంకు బొంకులో తాను కొనసాగుతుంది.

'మగడు మదనుడైన మంచి కాపురమైన
సహజమేల మాను జారకాంత?
పాలుద్రావు కుక్క పరిగెత్తి పోవదా?'

అని ప్రశ్నించాడు వేమన. పరపురుషునిపై మరులుగొన్న పడతి భర్తకు మాత్రం తానెంతో సాధ్వననే భ్రమ పుట్టిస్తుంది. 'పరపురుషుని మీద ప్రాణంబు పెట్టుక, మగువ చేయచుండు మంచితనము' అంటూ అలాటి వగలాడి గుట్టు విప్పాడు వేమన.

వేరొక పద్యంలో ప్రస్తుతం చర్చలోనున్న సామెతలను పోలిన భావాలను ప్రకటించాడు :

'జగడమునకు బోదు జారిణి ఎపుడు
మాయచేసి పురుష మమత బెట్టు'

జారస్త్రీ తన మగనితో జగడములాడదు. కపట ప్రేమ నటిస్తుంది. ఆడదాని బొంకు గోడ కట్టినట్టుంటుంది. కాపురంలో శీలం నమ్మకం పడుగు పేక వంటివి. స్త్రీ తాను నిర్ణయించుకుంటే ఏ విధంగానైనా భర్త కన్నుగప్పి వ్యభిచార వ్యవహారాలు

నడిపించగలుగుతుంది. చీకటింట్లో దివ్వె చెలగునట్లు సులక్షణయై నట్టింట నడయాడే ధర్మపత్ని నిలువెత్తు బంగారమంత విలువ గలది.

విశృంఖల ప్రవర్తన గల జాణ తన గుట్టెవరికీ తెలియదనుకొంటూ ఉంటుంది గానీ, అనతి కాలంలోనే అది బట్టబయలు అవుతుందనే భావం తెలుగు, బైబులు సామెతలు రెండిటిలోనూ లీలగా గోచరమవుతున్నది.

## 11

తెలుగు సామెత : గురివిందగింజకు ఎన్ని వన్నెలున్నా గొప్ప లేదు / కాకి ముక్కున దొండపండు

బైబులు సామెత : పంది ముక్కుకున్న బంగారు పోగులాంటిది అవివేకవతి అందము (సామెతలు 11:22)

గురివింద గింజకు ఎన్ని వన్నెలున్నా గొప్పది కానట్లే, వివేకము లేని స్త్రీ అందమైనదైనా గొప్పది కాదు. ఆమె అందం రోతలో, రొచ్చులో విహరించే పంది ముక్కుకున్న బంగారపు పోగువలె – ఎబ్బెట్టుగా ఉంటుంది.

అజ్ఞానులకు అందమున్నా వారు గొప్పవారు కాదు. కాగా, అసహ్యకరమైన, అపరిశుభ్రమైన స్థానంలో ఉండడం వలన విలువైన వస్తువులు తమ ఔన్నత్యాన్ని కోల్పోతాయి. అందుకే "పంది ముందర ముత్యాలు పోయవద్దని" బైబులు హెచ్చరిస్తుంది. కోకిలమ్మ అడవిలో పాడడంవల్ల దాని మాధుర్యం వ్యర్థమైంది. వెన్నెల అడవిలో కాయడంవల్ల దాని చల్లదనం నిష్ఫలమైంది. అదే విధంగా బంగారు కమ్మి పంది ముక్కున ఉండి విలువను కోల్పోతుంది. సౌందర్యం వివేకం లేని స్త్రీ మూర్తి నాశ్రయించి రాణింపును, రమ్యత్వాన్ని కోల్పోతుంది. గురివిందగింజకు నలుపు వల్ల నాణ్యత కరువైంది.

అందం హృదయానికి ఆనందాన్ని కలిగించాలి. నూతనోత్సాహాన్ని, మధురోహ లను మేల్కొల్పాలి. నవచైతన్యాన్ని నింపాలి. అటువంటి అందమే నిజమైన అందంగా సార్థకమౌతుంది. బాహ్య శరీర సౌందర్యాలకు సద్గుణాలు తోడైతేనే ఇటువంటి మహదానందాన్ని కలిగించే అందం రూపుదాల్చుతుంది. "బంగారానికి పరిమళ మబ్బినట్లు" శాశ్వత సౌందర్య సంపదగా నిలిచిపోతుంది.

గురివిందగింజ అందమైనదే. అయితే వివర్ణాలకు, మచ్చలకు అది ఆస్పదమవడం వలన రంజింపజేయలేని హీనతకు గురియైంది. కనుక సౌందర్యవతియైన స్త్రీకి సద్గుణాలుంటే ఆమె జగదారాధ్యయౌతుంది. లేకపోతే పందిముక్కున ఉన్న బంగారు నగలాగా నిరుపయోగమై, జుగుప్స కలిగిస్తుంది. పైపై మెరుగుల వలన సార్థకత రాదు. కాకి తన నల్లని ముక్కున దొండపండు చిక్కించుకుంటే అది అపహాస్యం పాలవుతుందే గాని శోభించదు.

వినయం, వివేకం సౌశీల్యమే పడతికి ఆభరణాలు. మృదుభాషణ, సచ్ఛీలత ఉన్న అతివలు కనకవజ్ర వైఢూర్యాలు లేకుండానే రాణిస్తారు. గుణగుణాలు లోపించిన వారు ఎన్ని తళుకులీనినా సజ్జనుల హృదయాలను రంజింపజేయలేరని ఈ సామెతలు బోధిస్తున్నాయి.

## 12

తెలుగు సామెత : తిరిగే కాలు, తిట్టే నోరు ఊరుకోవు

బైబులు సామెత : గాలిని ఆపుట గాని, చమురును గుప్పెట పట్టుట గాని ఎంత కష్టమో, గయ్యాళి భార్య నోరును మూయించుట అంత కష్టము (సామెతలు 27:16)

కొన్ని వికృత చేష్టలు పుట్టుకతోనే వస్తాయి. అలాంటివాటిని మానుకోవడం కష్టసాధ్యం. అటువంటి విచిత్రమైన అలవాటు గలవారి విషయంలో ఈ సామెత ప్రయోగిస్తారు. కొంతమంది స్థిరంగా, స్థిమితంగా ఒకచోట కూర్చోలేరు. కాలు గాలిన పిల్లిలాగా పని ఉన్నా, లేకున్నా తిరుగుతూనే ఉంటారు. సమయం, సందర్భం చూడకుండా, అకారణంగా తిరుగుతారు. మరి కొందరు అవిశ్రాంతంగా మాట్లాడు తూనే ఉంటారు. ఎదుటివారికి ఆటంకమని గాని, ఎవరైనా బాధపడతారని గానీ చూడకుండా నిష్టురోక్తులు పలుకుతూనే ఉంటారు. ప్రతి చిన్న విషయానికీ గొంతు చించుకొని అరుస్తూ, తిడుతూ రాద్ధాంతం చేస్తారు. ఇవి మానుకోలేని అలవాట్లు. అలాంటివారిని ఎవరూ సాధుపరచలేరు. వారంతట వారు కూడా ఈ విచిత్రపు చేష్టలను విడిచిపెట్టలేరేమో!

గయ్యాళియైన భార్య కూడా ఇటువంటిదేనని బైబులు సామెత. అకారణంగా ఆమె అందరినీ తూలనాడుతుంది. ఏమేమో మాట్లాడుతుంది. అర్థంపర్థం లేని సాధింపులు, వేధింపులు మొదలుపెడుతుంది. ఇంటినంతా ఒక రేవుకు తెస్తుంది.

ఇటువంటి గయ్యాళి భార్యను శాంతింపజేయడం గాలిని మూటగట్టటమంత, చేతితో నూనెను పట్టుకోవడమంత కష్టం. ఇటువంటి భార్యతో సంసారం చెయ్యడం కంటే సన్యాసిగా మారి ఎక్కడో ఏకాకిగా ఒంటరి జీవితం గడపడం సుఖమని జనశ్రుతి. వినయ వివేకాలు లేని స్త్రీ పంది ముక్కున ఉన్న బంగారు పోగు వంటిదని సామెత (సామెతలు 11:21). దీనిని గయ్యాళి భార్యకు కూడా అన్వయింపవచ్చు!

సంసారం సానుకూలంగా సాగాలని గానీ, సంతానం అభివృద్ధి చెంది పేరు ప్రతిష్ఠలు తేవాలని గానీ ఇటువంటి స్త్రీలు కోరుకొనరు. వారి ధోరణి వారిదే. వారి తిరుగుడు, వాగుడు అవిచ్ఛిన్నంగా సాగవలసిందే. ఇటువంటి వారినుద్దేశించి ఎవరు బోధించాలనుకున్నా వారు విసుగుతో మానివేయవలసిందే గాని వీరి ప్రవర్తనంలో కొంచమైనా మార్పు రాదు! అందుకే గయ్యాళితో పెద్ద ఇంటనుండుట కంటే, మిద్దెమీదనొక మూలను నివసించుట మేలు అనే బైబులు సామెత ప్రసిద్ధమైనది.

## 13

తెలుగు సామెత : దూరపు కొండలు నునుపు

బైబులు సామెత : పరస్త్రీ పెదవులు తేనెలొలుకుచుండును (సామెతలు 5:3)

మనకు దూరంగా ఉన్నంతవరకు, లేక మనకు తెలియనంతవరకూ అన్నీ బాగానే ఉన్నాయనుకుంటాం. రైల్లో కూర్చుని ప్రయాణం చేస్తుంటే మార్గమంతా తిన్నగా ఉన్నట్లే భ్రమ కలుగుతుంది. బయటికి తొంగి చూచినప్పుడు మార్గంలో ఎన్ని వంకరలున్నాయో, ఎన్ని నిమ్నోన్నతాలున్నాయో అర్థమౌతుంది. అలాగే ఒక కొండను దూరం నుంచి చూస్తే, అది నునుపుగా ఉన్నట్లు కనిపిస్తుంది. దగ్గరకు వెళ్ళి చూస్తే దాని మీద ఉన్న వృక్షజాలం, మిట్టపల్లాలు స్పష్టంగా కనిపిస్తాయి. సంసారాన్ని గాని, సంఘాన్ని గాని, ఒక వ్యక్తిని గాని మామూలుగా చూస్తే ఆనందంగానే ఉన్నట్టు, అంతా ఐకమత్యంతో కలిసి మెలిసి ఉన్నట్టు, ఏ బాధలూ లేకుండా సౌఖ్యవంతంగా సాగిపోతున్నట్టు అనిపిస్తుంది. అయితే నిశితంగా పరిశీలిస్తే అందులో ఉన్న లోగుట్టు, అనైక్యత, నిరంతర ప్రయాస కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. ఇటువంటి సందర్భాలలో 'దూరపు కొండలు నునుపు' అనే ఈ సామెత ప్రాచుర్యాన్ని పొందుతుంది.

బైబులు సామెతలో పరస్త్రీని గురించి ప్రత్యేకంగా చెప్పబడింది. స్వంత భార్యను ప్రతిదినం చూస్తూ ఉంటాము గనుక ఆమె మీద చులకన భావం పొటమరిస్తుంది.

పరస్త్రీ దూరంగా ఉంటుంది గనుక, ప్రతిరోజూ పరిశీలనగా చూడలేము గనుక ఆమె అత్యంత ఆకర్షణీయంగా ఉండి, ఆమె కనిపిస్తే అప్సరాంగన అగుపించినట్లు, పెదవి విప్పితే తేనియలు కురిసినట్లుగా భ్రమ కలుగుతుంది. బైబులు సామెతకు, పైన వివరించిన తెలుగు సామెతకు సామీప్యం ఉంది.

అందుకే ఇలాటి పరకాంతా వ్యామోహం కలవారిని ఉద్దేశించి 'పంట చేను విడిచి పరిగేరుకున్నట్టు' 'తనదు కానియాలు దానవురాలురా' అని అంటాడు వేమన. బైబులులో 'నీ స్వంత కుండలో నీళ్ళు పానము చేయుము' అనే సామెత ఉన్నది. కాగా 'దూరపు కొండలు నునుప'ను తెలుగు సామెత, 'పరస్త్రీ పెదవులు తేనె లొలుకుచుండు'నను బైబులు సామెతలు రెండూ సమానార్థ సందేశ సంశోభితాలు!

## 14

తెలుగు సామెత : పూజకొద్దీ పురుషుడు, పుణ్యంకొద్దీ పుత్రుడు

బైబులు సామెత : స్త్రీ ఏ పురుషుడనైనను వరించవలెను కాని, పురుషుడు తనకు నచ్చిన యువతిని వరించును (సీరా 36:21)

తెలుగు ప్రజల హీబ్రూ ప్రజల సంస్కృతులు కొన్ని విషయాలలో ఒకదానికొకటి సరిపోలుతూ ఉంటాయన్నది నిర్వివాదాంశం. అటువంటి అంశాలలో పురుషాధిక్యత ప్రధానమైనది. పురుషాధిక్య సమాజానికి దర్పణంగా నిలిచే సామెతలు ఇవి రెండూనూ.

ఆడపిల్లకు యుక్తవయసు వస్తున్న తరుణంలో అప్పటివరకు అల్లారుముద్దుగా పెంచుకొన్న తల్లిదండ్రులకు ఆమె గుండెలపై కుంపటివలె తోస్తుంది. ఎవరో ఒక వరుని వెదకి ముడిపెట్టి సాగనంపాలన్న తాపత్రయం తల్లిదండ్రులకు అధికమవు తుంది. పెళ్ళిచూపుల తంతు ఆరంభమవుతుంది. గంగిరెద్దు వలె అలంకరించుకుని తలవంచుకుని ఆడపిల్ల కూర్చుంటుంది. ఇక్కడ ఆమె ఇష్టాయిష్టాలను అడిగే వారుండరు. ఆ వచ్చినవాడికి నచ్చితే, లాంఛనాల విషయంలో బేరం కుదిరితే ఆడపిల్ల తల్లిదండ్రులకు అదే మహా భాగ్యం. ఇక మొదలవుతుంది అల్లుని రాజఠీవి. జాషువా కవి 'అల్లుడు' ఖండికలో అల్లుడు జనాంతికంగా ఇలా తలపోస్తూ ఉంటాడు:

'కొట్టుటకు తిట్టుటకు నొక
పట్టా జన్మించినట్లు భావించి, వెతల్
బెట్టితి నిల్లాలిని, నా
పెట్టు శ్రమలనోర్చె సతియు విధియను కొనుచున్'

తెలుగు సామెతలోని సారాంశమిదే. భర్త దయగలవాడైతే తన నోములు పండాయనుకుంటుంది ఇల్లాలు. కష్టపెట్టేవాడైతే తన పూజా ఫలమింతే అని సరిపెట్టుకుంటుంది.

'సతులొనరించిన పూర్వా
ర్జిత కర్మంబనుచు నిందచేసితి సకియన్
నుతియును మోక్షం బెరుగని
సతీమణియు నమ్మె పరమ సత్యం బనుచున్'

మొత్తంగా తెలుగు సామెతలో పడతి తనకు ప్రాప్తమైనదానిని బట్టి తృప్తిపడి ఊరుకొనడంతప్ప వేరు గతి లేదన్నదే ఇక్కడ ప్రధానాంశం. బైబులు సామెత కూడా జీవిత భాగస్వామి ఎన్నికలో స్త్రీకి లేని పురుషునికున్న స్వేచ్ఛ గురించే మాట్లాడుతున్నది.

ఈ విధంగా ఈ తెలుగు, బైబులు సామెతలు పురుషాధిక్య సమాజాలలోని స్త్రీల దుస్థితిని కళ్లకు కడుతున్నాయి.

## 15

తెలుగు సామెత : స్త్రీకి స్త్రీయే శత్రువు

బైబులు సామెత : స్త్రీలు స్త్రీలను నాశనము చేయుదురు (సీరా 42:12)

ఒకే జాతి జీవుల మధ్య జీవన పోరాటముంటుందన్నది ప్రకృతి సత్యం. కుటుంబ జీవనంలో పలు వావివరసల్లో బంధితులైన స్త్రీమూర్తుల మధ్య నెలకొని ఉండే రాగద్వేషాలు ఈ సామెతలు ప్రతిపాదిస్తున్న సత్యానికి తార్కాణాలు.

అమ్మా అంటూ తన కొంగుపట్టుకు తిరిగిన కొడుకు ధ్యాస ఇప్పుడు కోడలి చుట్టూ పరిభ్రమిస్తూ ఉండడం తల్లికి నచ్చదు. అమృతమూర్తియైన అమ్మ ఉగ్రకాళియైన అత్త అవతారమెత్తుతుంది. ఆడబిడ్డలు, తోడికోడళ్ళు శత్రువులౌతారు. భర్తను అతని ఆత్మీయుల నుండి వేరుచేసి వేరు కాపురం పెట్టించడానికి భార్య కృషి చేస్తుంది. ఈ విధంగా స్త్రీలే స్త్రీలకు శత్రువులు.

స్త్రీలోని వేరొక హీన గుణాన్ని వేమన కవి ఇలా అభివర్ణించాడు:

'వారకాంత లెల్ల వలచి యేతెంతురా
పొందుజేసి ధనము పుచ్చుకొనక?
మాట రూఢిగాగ మగలెల్ల వత్తురు'

పురుషులు పరకాంతల మోహమాయలో తగుల్కొని ఇంటనున్న ఇల్లాలిని విస్మరించడం కద్దు. ఇల్లంతా వెలయాలికి దోచిపెట్టి మగడు ఊరేగుతుంటే కులసతి గ్రుడ్ల నీరు కుక్కుకుంటూ కుములుతుంది. స్త్రీయే తన సాటిస్త్రీ కొంప కూలుస్తుంది.

అతిలోక సుందరి హెలెను మూలంగా ట్రాయ్ నగర ముత్తయిదువల ఐదవతనం మంట గలిసింది. ద్రౌపది క్రోధ దావాలనంలో కురువంశ సువాసినుల మాంగల్యాలు మాడి మసైపోయాయి. సీత ఉసురు లంక లోలాక్షులకు వైధవ్యం దాపురింపజేసింది. ఈ వైనాలన్నిటిలోనూ పురుషులు నిమిత్తమాత్రులే ననిపించకమానదు.

ఎంత కోపమున్నా పురుషుడు కలకంఠి కంట కన్నీరొలికితే కరుగుతాడు. సాటి ఆడదాని కన్నీరు ఆడదానిని కదిలించలేదు. కాబట్టి స్త్రీయే స్త్రీకి శత్రువన్న ప్రతిపాదన సమర్థనీయమే.

స్త్రీ సంబంధిత సామెతలకు తెలుగు భాషలోనూ, బైబులులోను సముచిత స్థానమున్నది. పరిశీలించిన సమానార్థకాలైన తెలుగు, బైబులు జంట సామెతలలో సంసారులై భర్తకు అనుకూలవతులైనవారు, గయ్యాళి తనంతో చెప్పులోని రాయివలె ఇంట్లో పోరు సృష్టించేవారు, భర్తను విస్మరించి పరపురుషులను కామించేవారు, మాట దాచలేనివారు కనిపిస్తున్నారు.

# రెండవ భాగం:

## తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం

## 6. తెలుగు, బైబులు సామెతలు: వ్యవసాయం

# 6. తెలుగు, బైబులు సామెతలు: వ్యవసాయం

మానవ వృత్తులలో వేట తరువాత ప్రాచీనమైనది వ్యవసాయమే. ఇది ఎప్పుడు ప్రారంభమైనదో ఖచ్చితమైన ఆధారాలు లేవు. అయితే క్రీస్తు పూర్వం 3,500 సంవత్సరం ప్రాంతానికి చెందిన ఈజిప్టు పిరమిడ్లలో గోధుమలు కనిపించాయి. అందువలన అంతకుముందు ఎప్పటినుండో వ్యవసాయం ఉన్నట్లుగా భావించవచ్చు.

వ్యవసాయం మానవ జీవనాధారం. అందువలన ప్రతి భాషలోనూ వ్యవసాయ సంబంధిత సామెతలుండడం సహజం. ఈ అధ్యాయంలో తెలుగు, బైబులు సామెతలలో వ్యవసాయానికి సంబంధించిన సమానార్థకాలైన అయిదు సామెతలను పరిశీలిద్దాం.

## 1

తెలుగు సామెత : ఎద్దు ఏడ్చిన సేద్యం ముందుకు రాదు

బైబులు సామెత : ఎద్లు దున్ననిచో గాదెలు నిండవు (సామెతలు 14:4)

సేద్యం చేయడంలో ఎద్దులు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఎడ్లను బాగా పోషిస్తే, అవి బాగా పనిచేస్తాయి. ఆ సేద్యం మూడు పూవులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందుతుంది. అలా కాకుండ ఎడ్లను ఎండగట్టి వాటిచేత ఎక్కువగా పనిచేయిస్తే అది ఎడ్లకు, యజమానికి కూడ మంచిది కాదు. ఆ వ్యవసాయం ముందుకు సాగదు. వ్యవసాయమే కాకుండా ఏ పనిలోనైనా కష్టపడేవానికి తగిన ఫలితాన్నివ్వాలి. ఆ కష్టజీవి సంతోషిస్తే కష్టం చేయించుకున్నవానికి కూడా శుభం కలుగుతుంది. మంచి ఫలితం వస్తుంది. "కలకంఠి కంట కన్నీరొలికిన సిరి ఇంట నుండనొల్లదు" అన్న సుమతీ శతకకర్త బద్దెన వాక్కులలో ఉన్న అంతరార్థం కూడా ఇదే. కాబట్టి ఎద్దులు ఏడిస్తే సేద్యం ముందుకు సాగనట్లే, కష్టించినవాడికి తగిన ఫలితాన్ని ఇవ్వకపోతే, ఆ కష్టం చేయించుకున్నవాడు కూడా అభివృద్ధి చెందడు. ఎంతోమంది కష్టజీవులు ఏడుస్తూ ఉంటే ఏ కొద్దిమందో ధనాఢ్యులు సుఖపడాలంటే అది సమంజసం కాదు. "సొమ్మొకడిది సోకొకడిది" అనే సామెత మొరటుగా ఉన్నా ఇతరుల కష్ట ఫలాన్ని వేరొకరు అనుభవించడం అశుభదాయకమైన కృత్యమని చెబుతుంది.

చాగంటి సోమయాజులు (చా.సో.) ఈ దోపిడీ వ్యవస్థను తన "చాసో" కథల సంపుటిలో చక్కగా చిత్రీకరించాడు. ఒక ముసలివాడి చేత పని చేయించుకుని మల్లె చెట్టు నాటించి మల్లెలమ్మించి, రు. 300/- లాభం పొందుతాడు యజమాని. ఆ కూలివాడేమో యజమాని ఇచ్చిన నాలుగు రాళ్ళు తీసుకొనిపోతాడు. కొన్నాళ్ళకు కూలివాడు తిండిలేక మరణిస్తాడు. అతని విషయం యజమానికి తెలిసి అతని శ్రమకు తగిన ఫలితాన్ని ఇవ్వనందుకు పశ్చాత్తాపపడతాడు. కాబట్టి ఎద్దు ఏడిస్తే సేద్యం ముందుకు సాగదనేది జగమెరిగిన సత్యం.

బైబులు సామెతలో ఎడ్లు దున్ననిచో గాదెలు నిండవు అని ఉంది. ఎడ్లు దున్నాలి. అవి దున్నాలంటే వాటికి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలి. అలా కాకుండా ఎడ్లను ఏడిపిస్తే అవి పనిచేయలేవు. రైతుల గాదెలు నిండవు. 'కుప్ప నూర్చెడి ఎద్దు మూతికి చిక్కము పెట్టవద్దు' అని మరొక బైబులు సామెతలో వివరించబడింది. కూలివానికియ్య వలసిన ధనాన్ని సాయంత్రం వరకూ నీ యొద్ద ఉంచుకొనవద్దని ఇంకొక బైబులు సూక్తి తెలియజేస్తుంది.

తెలుగు, బైబులు సామెతలు ఎడ్లను గురించి వివరించినప్పటికీ ఈ రెండు సామెతలు సమానార్థకంగా కష్ట జీవులందరికీ వర్తిస్తాయి. పశుపక్ష్యాదులనైనా కష్టం చేయించుకొని, వాటికి తగిన పోషణను ఏర్పాటు చేయకపోతే అవి అనతి కాలంలోనే అంతరిస్తాయి. వాటిమీద ఆధారపడిన సేద్యమైనా, ఏ పనైనా ఆగిపోతుంది. అలాగే కష్టజీవులు కన్నీరు కారిస్తే ఏ కార్యం ముందుకు సాగదు. 'నిమ్నజాతుల కన్నీటి నీరదములు, పిడుగులై దేశమును కాల్చివేయుననుచు, రాట్నమును దుడ్డుగఱ్ఱ కరానబూని దెసలతో తెంచెగుజరాతు ముసలి సెట్టి' (గబ్బిలము, రెండవ భాగము) అంటాడు మహాకవి గుఱ్ఱం జాషువ. ఇందులో ఎంతో పరమార్థం, ఈ సామెతల గూఢార్థం తొంగిచూస్తుందనడం సత్యదూరం కాదు.

## 2

తెలుగు సామెత : ఎద్దుకొద్దీ సేద్యం

బైబులు సామెత : బలము గల ఎడ్లు దున్నినచో పంటలు సమృద్ధిగా పండును (సామెతలు 14:4)

‘ఎద్దుకొద్దీ సేద్యం’ అన్న నానుడిలోని సత్యం గ్రామీణులకు తేటతెల్లం. రైతు సేద్యంలో అతని నేస్తం పశువులే. పల్లెల్లో నోరులేని ఈ మూగ జీవులకూ రైతన్నలకూ మధ్య ఉండే ఆత్మబంధం మాటలకందనిది. ఆరుగాలాలు తనకు తోడు నిలిచి ఎదురాడకుండా కఠోర పరిశ్రమ చేసే పశువులకంటే రైతుకు ఇంటిల్లిపాదికీ ఎనలేని ఆపేక్ష ఉంటుంది. పశువులు కూడా మొరాయించకుండా వంచిన నడుము ఎత్తకుండా విశ్వాసంతో పనిచేస్తాయి. పశువులు పుష్ఠిగా ఆరోగ్యంగా ఉంటే ఆ కామందు వ్యవసాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లుతుంది. ఈ సత్యాన్నే బైబులు సామెత కూడా ‘బలము గల ఎద్లు దున్నినచో పంటలు సమృద్ధిగా పండును’ అని వేరే మాటలలో చెబుతున్నది.

ఇలా ఈ రెండు సామెతలు వ్యవసాయంలో ఎద్దుల పాత్రను విశదపరుస్తూ, రైతు తన మంచి కోసమైనా (మంచి పంట కోసమైనా) వాటిని మంచిగా చూచుకొనవలసిన అవసరాన్ని పరోక్షంగా నొక్కి చెబుతున్నాయి.

## 3

తెలుగు సామెత : ఒకనాటి అదను ఒక ఏటి బ్రతుకు
అదును చూసి పొదలో చల్లినా పండుతుంది.
అదను తప్పితే అరచినా పండదు.

బైబులు సామెత : ఋతువు వచ్చినప్పుడు సేద్యము చేయనివాడు పంటకాలమున ఏమియు కోసికొనజాలడు (సామెతలు 20:4)

నిబద్ధత గలిగి శారీరిక శ్రమ చేయడం ఎంత ముఖ్యమో, చేస్తున్న పనిలో సమయస్ఫూర్తి కూడా అంతే అవసరం. ఈ భావాన్ని వ్యవసాయ నేపథ్యంలో అచ్చతెలుగు పదాలనుపయోగించి పైన పేర్కొన్న సామెతలు విశదీకరిస్తున్నాయి.

కాలము, ఆటూపోటులు ఎవరి కోసమూ ఆగవు అని ఒక ఆంగ్ల సామెత. అనుకూల పవనాలు వీస్తున్నప్పుడు తెరచాపనెత్తిన నావికుడు సుదూర తీరాలకు సాగిపోతాడు. నిత్య శంకితుడు నిత్య దరిద్రుడే. ఇనుము ఎర్రగా కాలినప్పుడే సమ్మెట దెబ్బ పడాలి. కీలెరిగి వాత పెట్టాలి. అంతా అయిపోయాక తలపట్టుకుని కూర్చుని లాభం లేదు. ఈ ఆలోచనా విధానం మన వ్యవసాయ రీతుల్లో ఎంతో కీలకమైనది.

ఋతుపవనాలు వీస్తున్నాయనగా రైతు ఆ అదును కనిపెట్టి భూమిని పదును చేసి సేద్యం ఆరంభిస్తాడు. ఏ కాలానికి జరగవలసింది ఆ కాలానికి జరగాలి. ఎడతెరిపి లేకుండా వానలు ముంచెత్తినా నష్టమే. వాన రాకడ, ప్రాణం పోకడ దైవాధీనమన్నట్టు తన చేతుల్లో లేనిదాని గురించి కర్షకుడు చింతిస్తూ కూర్చోడు. వాతావరణాన్ని కనిపెట్టి చూస్తూ అదనులో నారు పోయడం, నీరు పెట్టడం, నాట్లు వేయడం, కలుపు తీయడం, ఎరువులు చల్లడం తదితర పనులు ముగించుకుంటాడు.

ఇటు విత్తనంలోని జీవచక్రానికి అటు ఋతు చక్రానికీ సమన్వయం కుదిరితే ఇక భూమాత ప్రసాదించే సిరులకు అంతుండదు. అందుకే అదును చూచి పొదలో చల్లినా పండుతుందనే లోకోక్తి పుట్టింది. అడగవలసిన రీతిలో అడిగితే మనుషులే కాదు, దేవుడూ కాదనడు.

అదను తప్పితే అరిచి గీపెట్టినా ఏమీ పండదు అని బైబులు చెబుతున్నది. తొలకరి వర్షాలు పడిన వెంటనే నాట్లు పడాలి. దేనికైనా సమయం, సందర్భం ఉండాలి. కాలం దాటిపోయాక ఎంత శ్రమించినా పంట రాదు. ఇది జన సామాన్యంలో బాగా పరిచయమున్న జ్ఞానమే. అయినా ఎందరెందరో అదను ఉన్నప్పుడు ఊరకుండి ఆ తరువాత శ్రమిస్తారు. అందుకు ఫలితం ఉండదు. ప్రతిదానికీ దేని సమయం దానికి ఉంది (ప్రసంగి 3:1).

**4**

తెలుగు సామెత : గొడ్డు రైతుబిడ్డ
దుక్కిటెద్దు చావు పక్కలో పెళ్ళాం చావులాంటిది
పాన్పు సెబ్బరైతే పసరానికి సెబ్బర
పది దుక్కుల తరువాత దున్నేవాడు పాపాత్ముడు

బైబులు సామెత : సత్పురుషుడు తన పశువులను దయతో చూచును
(సామెతలు 12:10)

ఈ తెలుగు సామెతలు గ్రామీణ వ్యవసాయిక జీవన చిత్రాన్ని కరుణ రసస్ఫోరకంగా వ్యక్తపరుస్తున్నాయి. కర్షకుల కుటుంబాలలో వారికి చెందిన పశువులూ అంతర్భాగాలే. ఆ మూగ జీవులతో రైతు కుటుంబ జీవితం పెనవేసుకొని ఉంటుంది. గోవులను పవిత్రంగా ఎంచి ఆదరించే సంస్కృతి మనది. గోమాతను లక్ష్మీదేవిగా, పనిచేసే పశువులను బసవయ్యలుగా ఎంచి ఆపేక్షగా చూచుకుంటారు రైతులు. యజమాని చూపే దయకు, ఆపేక్షకు సముచిత రీతిలో స్పందించి ఎనలేని అవ్యాజానురాగాలను చూపుతూ మానసిక బంధాన్ని పెంచుకోవడం పశువుల్లో కూడా సహజంగా గోచరమవుతుంటుంది.

భూత దయ అన్నది మన సనాతన ధర్మం. మనకు ఉగ్గుపాలతో నేర్పించిన సుగుణం. పైన ఉదహరించిన తెలుగు సామెతలన్నిటిలోనూ మన గ్రామీణ సంస్కృతి, పశుపోషణ విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఎంతో హృద్యంగా గోచరిస్తున్నాయి. నిజంగానే రైతు తన కడుపున పుట్టిన వారితో పాటు ఇంటి పశువులను మన్ననతో చూస్తాడు. ఇదొక ఉత్తమ గుణం. తనతోపాటుగా ఆరుగాలాలు అన్నిరకాలుగా శ్రమించే దుక్కిటెద్దు అర్థంతరంగా చనిపోవడంలోని ఆవేదన కూడా పై సామెతలో వ్యక్తమయింది. దుక్కిటెద్దు చావు పక్కలో పెళ్ళాం చావంత బాధ కలిగించే విషయం.

తరువాతి సామెత “పది దుక్కుల తరువాత దున్నేవాడు పాపాత్ముడు” అనేది బైబులు సామెతకు మిగతావాటికన్నా దగ్గరగా ఉన్నది. పశువు కదా, నోరు లేనిది కదా, ఓర్చుకుంటుంది గదా అని దయాదాక్షిణ్యాలు లేకుండా అదే పనిగా ప్రొద్దస్తమానం పనిలో పెట్టడం అమానుషం. పశువుకు సైతం విశ్రాంతి అవసరం. మేపగలిగిన తాహతు ఉండి కూడా తన పశువులకు సరైన దాణా వేయకుండా నాలుగు ఎండు పరకలు విదిల్చి చేతులు దులుపుకునేవాడు కఠినాత్ముడు. పశువు అదిలించినకొద్దీ పనిచేస్తూనే ఉంటుంది. ఎప్పుడో గానీ మొరాయించదు. అలాగని అదే పనిగా పని చేయించుకునే వాడు పాపాత్ముడని తెలుగు సామెత, బైబులు సామెత హెచ్చరిస్తున్నాయి. జీవకారుణ్య నేపథ్యంలో మన పల్లెపట్టుల్లో సాధారణంగా కనిపించే ఈ మనిషి, మూగ జీవుల మధ్య ఉండే బంధం కమనీయంగా ఈ సామెతల్లో సాక్షాత్కరిస్తుంది.

## 5

తెలుగు సామెత : పాటు కలిగితే కూటికి కొదువా
దుక్కి ఉంటే దిక్కు ఉంటుంది
దుక్కికొద్దీ పంట, బుద్ధికొద్దీ సుఖం

బైబులు సామెత : ఒడలు వంచి పుడమి దున్నువానికి కరవులేదు
(సామెతలు 12:11; 28:19)

తొలకరి వానలతో రైతు హలం పట్టి పొలం దున్ని వార్షిక వ్యవసాయ యజ్ఞానికి శ్రీకారం చుడతాడు. నేలను నమ్ముకుని బ్రతికే రైతు తానింత తిని ప్రజానీకానికి ఇంత అన్నం పెడతాడు. తెలుగు సామెతలు మూడూ జానపద శైలిలో ఆత్మీయమైన అచ్చతెలుగు పదాలతో శ్రమైక జీవన సౌందర్యాన్నీ, సాఫల్యాన్నీ, సంతృప్తినీ ఆవిష్కరిస్తున్నాయి. బైబులు సామెత నూటికి నూరుశాతం తెలుగు సామెతతో శైలిలోనూ, అర్థంలోనూ ఏకీభవిస్తున్నది.

తెలుగునాట సేద్యంలాగానే హీబ్రూ ప్రజల వ్యవసాయం కూడా వర్షాధారం. గోధుమలు, బార్లీ, ద్రాక్ష పంటలు గాక అంజూర పండ్లు, ఖర్జూరాలు ఆ ప్రజల వ్యవసాయోత్పత్తులు. బైబులు సామెత పుట్టిన రోజులకు ఎడ్లతో అరక దున్నడం ఆ ప్రాంతాలలో పరిపాటి. అంతకు ముందు స్థూలంగా వారు గొర్రెల కాపరులు. క్రమేణా వ్యవసాయం వారి ముఖ్య జీవనాధారమయింది.

పైన ఉదహరించిన అన్ని సామెతల్లోనూ శబ్దం, లయ రమ్యంగా శ్రవణానంద కరంగా ధ్వనిస్తున్నాయి.

మనోరంజకరమైన ఈ సామెతలు నేర్పించే సార్వత్రిక సత్యం మరింత హృద్యంగా ఉంది. రెక్కాడితేగానీ డొక్కాడదు అన్న నానుడిలోని నైరాశ్యం ఇందులో కనిపించదు. సకారాత్మక ధోరణిలో ఒళ్ళు వంచి పనిచేసిన వారి ఇళ్ళలో లక్ష్మీదేవి తాండవిస్తుందనే ప్రోత్సాహం ఇందులో ఉంది. కష్టించే కాపులకు కొదువ లేదు. ఏరువాక సాగాలి, వానలూ వరపులూ సమయానుకూలంగా వస్తూపోతూ ఉండాలి. వాగులూ వంకలూ నిండాలి. పల్లెలు నవధాన్యాలతో పాడిపంటలతో కళకళలాడాలి. ఇందులో రైతన్న కాయకష్టం అంతర్భాగం.

పనీపాటూ లేకుండా, సోమరిగా తిని కూర్చుంటూ, ఇతరుల జోలికి పోతూ, గిల్లికజ్జాలు పెట్టుకుంటూ కాలం గడిపే ప్రబుద్ధులను ఈ సామెతలు నిరసిస్తున్నాయి.

మన పల్లెపట్టుల్లో ఇలాటి సరదారాయుళ్ళ పట్ల సహజంగానే ఏవగింపు ఉంటుంది. పెద్దలు అస్తమానం ఇలాటి అప్రయోజకులను మందలిస్తూ వల్లించే సామెతలివి. అదే సమయంలో ఘర్మజలాన్ని నేలను చిందించి ఒళ్ళు వంచి దోసిళ్ళుగా రాశులుగా ధాన్యం పండించే కర్మవీరులను భుజం తడుతూ ఈ సామెతలు పలకడం కద్దు. ప్రొద్దుట లేవని కాపుకు పొలం ఇచ్చేది గడ్డే అనే సామెత కూడా ఈ కోవలోనిదే.

పరిశీలించిన సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతలలో వ్యవసాయ సంబంధులు ఐదు. వీటిలో ముఖ్యంగా ఆరుగాలాలు కష్టించి పనిచేయడంలోని సౌందర్యం, విజ్ఞత ఆవిష్కృతమౌతున్నది. రైతు తనకు చేదోడువాదోడుగా ఉండే మూగ జీవుల పట్ల చూపే అనురాగం కూడా కళ్ళకు కట్టినట్లుగా కనబడుతున్నది.

# రెండవ భాగం:

## తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం

## 7. తెలుగు, బైబులు సామెతలు: ఇతరాలు

# 7. తెలుగు, బైబులు సామెతలు: ఇతరాలు

ఇంతకుముందు పరిశీలించిన అధ్యాయాలలో ఒదగని సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతలను ఈ అధ్యాయంలో పరిశీలిద్దాం.

'నవ్విన నాపచేనే పండుతుందన్న' సామెత వ్యవసాయ సంబంధమైనదైనా దీనికి సమానార్థకమైన బైబులు సామెత ఉత్కృష్టతను బట్టి ఈ జతను వ్యవసాయ సంబంధిత సామెతలలో కలపడం లేదు. 'పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లు', 'చెట్టు చెడే కాలానికి కుక్కమూతి పిందెలు' వంటివి ఈ వర్గంలో ఉన్నాయి.

**1**

తెలుగు సామెత : చెట్టు చెడే కాలానికి కుక్క మూతిపిందెలు

బైబులు సామెత : అంత్యదినములలో అపాయకరములు సంభవించును (2 తిమోతి 3:1)

మొదట చక్కగా ఉండి రాను రాను అవసాన దశలో అవగుణాలు కలిగిన వారిని ఉద్దేశించి ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు. చెట్టు ప్రథమఫలం బాగా ఉంటుంది. రానురాను చెట్టు బలహీనమైపుడు సారవిహీనాలైన కాయలు వస్తాయి. ఇది జీవితానికీ, ప్రకృతిలోని పశుపక్ష్యాదులకూ, వృక్షాలకూ కూడా వర్తిస్తుంది. "వినాశకాలే విపరీత బుద్ధిః" అనే సామెత కూడా ఇటువంటిదే. వేమన కూడా 'చేటు కాలమునకు చెడుబుద్ధి పుట్టును" అని అంటాడు. మానవుడు పతనావస్థకు చేరువౌతున్నప్పుడు మంచి నశించి మానవత్వం మంటగలుస్తుంది. పెంచవలసినవాడే తుంచివేస్తాడు. పెట్టి పోషించినవాడే కొట్టి చంపివేస్తాడు. విశాల దృక్పథాలు పోయి, ఎవరికి వారు సంకుచిత భావాలతో సతమతమౌతుంటారు. అన్యాయం, అక్రమం అందలమెక్కుతాయి. న్యాయం, ధర్మం అన్నవాణ్ని వింత మనిషిగా చూస్తారు. నీతిని గురించి మాట్లాడడమే నీచ కార్యమౌతుంది. నిజం చెప్పడమే నిష్ఠూరానికి కారణమౌతుంది. చెట్టు చెడే కాలానికి మామూలు పిందెలు కాకుండా కుక్కమూతి పిందెలు, వికృతాకారాలు, విలక్షణాలు చోటుచేసుకుంటాయి.

బైబులు సందర్భానికొస్తే అంత్యదినాలు, అపాయకరమైన సమయం. అనుచితాలు, అవాంఛితాలు సంభవించే కాలం. పిదపకాలం, పిదప బుద్ధులు కనిపించే కాలం మానవులలో మార్పు వస్తుంది. ధనాపేక్ష గలవారు, బింకములాడేవారు, అహంకారులు,

తల్లీదండ్రులకు అవిధేయులు, కృతఘ్నులు, అపవిత్రులు అధికమౌతారు. అనురాగ రహితంగా ద్వేషంతో అపవాదులు కల్పిస్తూ, క్రూరత్వంతో సజ్జనులను ద్వేషించేవారు ప్రబలుతారు. మూర్ఖత్వంతో దేవునికంటే సుఖానుభవాన్ని ఎక్కువగా ప్రేమించేవారు విస్తరిస్తారు. పైకి భక్తిగలవారివలె ఉంటూ, దాని శక్తిని తెలియనివారు అధికమౌతారు. ఇలాంటివారిలో దేవుణ్ణి నమ్మినవారు, ఆస్తికులైనవారు చేరకూడదు.

అంతిమ ఘడియలలో అనర్థాలకు పాల్పడేవారి విషయంలో ఈ సామెతలను వాడతారు. ఇనుప గజ్జెల తల్లి తిష్ఠ వేసుకుని కూర్చున్ననాడు ఎవరి మాట పొసగనీయకుండా విపరీత బుద్ధులు ప్రదర్శిస్తారు. పోగాలము దాపురించినవాడు కనడు, వినడు, మూర్కొనడు గదా. రావణాసురుడు, దుర్యోధనుడు దీనికి ప్రత్యక్ష తార్కాణాలు.

**2**

తెలుగు సామెత : నవ్విన నాపచేనే పండును

బైబులు సామెత : ఇల్లు కట్టువారు పనికి రాదనిన రాయే మూలరాయి అయ్యెను (కీర్తనలు 118:22; మత్తయి 21:42)

మనము నవ్వి గేలిచేసిన వెర్రివాడే దేవుని పుత్రుడయ్యెను (జ్ఞానగ్రంథం 5:4)

నాపచేను నవ్వదు. తనను చూచి నవ్వినవారి హేళనను సవాలుగా తీసుకుని ప్రగతి సాధించి మెప్పిస్తుంది. తిరస్కారపాత్రమైనదే శిరోధార్యమవుతుంది. ఈ విడ్డూరం తరచుగా మనకు తారసపడుతూ ఔరాయనిపిస్తుంది. తెలుగు సామెత వ్యావసాయక నేపథ్యం నుండి ఈ సత్యాన్ని ప్రకటిస్తుండగా, బైబులు సామెతలు స్వజనంచే తిరస్కృతుడై తదనంతరం జగదేకవంద్యుడై వినుతికెక్కిన పావన క్రీస్తు పుణ్య లీలలను దర్శిస్తున్నాయి.

చంద్రగుప్తుడిని దాసీ పుత్రుడని రోసి వెళ్ళగొట్టారు రాకుమారులు. కండబలంతో అకుంఠిత దీక్షతో అతడు పరాక్రమించి చాణక్య భూసురుని అండతో నందవంశాన్ని కూకటివేళ్ళతో పెకలించగలిగాడు. తనదైన రాజవంశ పరిపాలనను భారతావనిలో స్థాపించగలిగాడు.

జొన్న మొదలగు పంటలను వేసిన చేలను కోయగా మిగిలిన కొయ్యగాలు

మోడులు చిగురించగా ఏర్పడినదే నాపచేను. అటువంటి నాపచేలు సాధారణంగా పండవు కాబట్టి వాటిని చూచినవాళ్ళు ఎగతాళిగా నవ్వుతారు. అటువంటి చేను పండితే...! ఈ నేపథ్యం నుండి పుట్టినది ఈ తెలుగు సామెత. దీనికి చక్కటి ఉదాహరణం మౌర్య చంద్రగుప్తుని చరిత్ర.

భవన నిర్మాణానికి చెక్కుడు రాళ్ళను ఇటుకలను ఉపయోగిస్తారు. ఒక్క శిలను మాత్రం భవనమంతటికీ తలమానికంగా నిలపడం కోసం శిల్పి వేరే నమూనాలో చెక్కి ఒక పక్కన ఉంచాడు. అతడు వెడలిపోయాక పనివారు వచ్చారు. ఒకే మూసలో ఉన్న రాళ్ళను పేర్చి ఇల్లు కట్టనారంభించారు. వేరుగా కనిపిస్తున్న శిలను చూచి దాని ఉపయోగమేమిటో అంతుబట్టక దాన్ని చులకన చేసి ఒక మూలన పడవేశారు. ఎందుకంటే వారు కట్టే నిర్మాణంలో మిగిలిన రాళ్ళతో ఇది ఇమడడం లేదు. అంతా పూర్తయ్యాక ప్రధాన శిల్పి వచ్చి ఆ శిలనుంచవలసిన స్థానం సూచించినప్పుడు అందరికీ అవగతమయింది దాని ప్రాధాన్యం. మనుజావతారుడైన మహా దేవుడు మానవ సమాజంలో ప్రత్యేకంగా అగుపించడంతో నాటి ప్రజలు ఆయనను నిరసించారు. ఆయన దివ్య ప్రవచనంలో పరమార్థమెంచలేక పనిగట్టుకుని ఆయనను పరిమార్చారు. అయితే ఆయన మృత్యుంజయుడై ముక్తిప్రదాతగా సింహాసనాధీశు డయ్యాడు. ఆ విధంగా ఇల్లు కట్టేవారు నిషేధించిన రాయి మూలరాయి అయిందన్న సామెత సిద్ధించింది.

జ్ఞానగ్రంథంలో కనిపించిన సామెత మరికొంత ప్రత్యక్షంగా ఈ సత్యాన్ని వ్యక్తపరుస్తున్నది. ఆనాటి ప్రజలు యేసు మృత్యుంజయుడైన తరువాత నిర్ఘాంతపోయి తమతో తాము ఆయనకు అన్వయించుకొనిన ప్రవచంలోని సూక్తి ఇది.

ఏ పుట్టలో ఏ పామున్నదోనన్నట్టు ఎవరినైనా తృణీకరించి తూలనాడడం విజ్ఞులకు తగదు. ఎందుకంటే నాపచేను పండవచ్చు! వెర్రివాడని వెలివేసినవాడే ఉర్వినాథుడుగా పరిణమించవచ్చు!

## 3

తెలుగు సామెత : పెనం మీదనుంచి పొయ్యిలో పడినట్లు

బైబులు సామెత : ఎలుగుబంటిని తప్పించుకొనినవాడు సింగము బారిన పడినట్లు (ఆమోసు 5:19)

ఒక అపాయాన్ని తప్పించుకుని పెద్దదైన మరొక అపాయంలో పడినపుడు పై తెలుగు సామెతను ఉపయోగిస్తారు. పెనం మీద ఒక వస్తువు కాలిపోతూ ఉంటుంది. దాని నుండి తప్పించుకోవాలంటే పెనం మీద నుండి బయటపడాలి. అలా కాకుండా పొయ్యిలో పడితే....?

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని తెలియజేస్తున్నది. ఎలుగుబంటి నుండి తప్పించుకోవడమంటే ఇక ఏ ప్రమాదమూ లేకుండా సురక్షితంగా ఉండాలి. అలా కాకుండా ఎలుగుబంటి నుండి తప్పించుకొని, దానికంటే పెద్దదైన సింగం బారిన పడితే, ఒక ప్రమాదాన్ని తప్పించుకొనబోయి దానికంటే మరీ పెద్దదైన ప్రమాదంలో చిక్కుకొన్నట్టు. ఇటువంటి సందర్భాలలో ఈ బైబులు సామెతను ఉపయోగిస్తారు. క్రింద పడబోయి, ఆధారం కోసం గోడను పట్టుకుంటే దాని మీద విష సర్పముంటే ఇక చెప్పేదేముంది?

**4**

తెలుగు సామెత : మూలిగే నక్కమీద తాటికాయ పడినట్టు
గోరుచుట్టుపై రోకటిపోటు

బైబులు సామెత : మూల్గెడు నక్కమీద తాటికాయ పడినట్టు (యోబు 12:5)

దుర్దశలో ఉన్నవాణ్ణి మరింత అథఃపాతాళానికి దొక్కజూస్తారు లోకులు. మానవులలో ఇదొక విచిత్ర స్వభావం. గజనీ మహమ్మదు ఇస్తానన్న ఈనాము ఇవ్వకుండా మోసగించగా క్రుంగిపోయి ఉన్న ఫిరదౌసిని వధించనాజ్ఞాపించాడు సుల్తాను. పండు వృద్ధాప్యంలో ప్రాణాలరచేతిలో పట్టుకొని ఫిరదౌసి పారిపోయిన విధం జాషువాగారు వివరిస్తూ,

'పడమటికి బ్రొద్దువాలిన
నడుగడుగున కులికిపడెడు నబలలతో దా
నడు గొక యామడగా న
య్యడ విని బయనింపసాగె నంత నొకదెసన్'

అనడంలో ఫిరదౌసికి కలిగిన కష్టాలకు కన్నులు చెమర్చక మానవు.

తెలుగు బైబులు సామెతలు అభివర్ణించిన సన్నివేశం దయనీయమైనది. నక్క అసలే అల్పజీవి. అందునా అస్వస్థత కలిగి కొనప్రాణంతో ఉన్నది. మండుటెండలో కొంత నీడనాశించి తాటిచెట్టు నీడన వచ్చి చేరింది. అంతలో పండిన పెద్ద తాటి పండు ఆ అర్భక జీవిపై రాలిపడి విలవిలలాడించింది.

అదేమిటో గానీ గోరుచుట్టు పైననే పడుతుంది రోకటిపోటు. నిలువ నీడలేక రహదారి అంచున ఆదమరచి నిద్రించే నిర్భాగ్యుల మీదికే దూసుకుపోతుంది బరువైన వాహనం. వేరే చోటు లేక నదీతీరాన గుడిసెలు వేసుకొన్నవారే వరదలపాలై జీవనం చిన్నాభిన్నమై వీధిన పడతారు. దళిత శ్రామిక నిరుపేదల మీదనే కడగండ్ల వాన కురిపించడం విధి వినోదం కాబోలు.

బైబులు సామెత నుడివే సమయంలో యోబు మనోభావాలు వర్ణనాతీతం. ఒక్కనాటనే సమస్తాన్నీ కోల్పోయి బికారిగా ఫకీరుగా మిగిలిన ఆ మహాత్మునికి తన మిత్రుల తిరస్కారం అశనిపాతంగా తోచింది. దుర్దశలో ఉన్న తనను తన హితులని తాను అనుకొన్నవారు తూలనాడడం అతని పాలిట మూలిగే నక్కపై తాటికాయ పడినట్టనిపించింది. ఈతిబాధలతో వేసారి ఉన్నవారికి మరింత గడ్డుకాలం దాపురించడాన్ని అభివర్ణిస్తూ ఈ సామెతలను ఉపయోగిస్తారు.

ఇప్పటివరకు పరిశీలించిన అధ్యాయాలలో ఇమడని ఈ సామెతలు మనమెరుగగలిగినదీ, గ్రహించగలిగినదీ, ఊహించగలిగినదీ పరిమితమే నన్న స్పృహను మనలో కలిగిస్తున్నాయి.

# ఉపసంహారం

# ఉపసంహారం

తెలుగు, బైబులు సామెతల తులనాత్మక పరిశీలనం ముగించబోయే ముందు సింహావలోకనం చేసుకోవడం సమంజసం.

ఈ సిద్ధాంత గ్రంథం మొదటి భాగమైన సైద్ధాంతిక నేపథ్యంలో చూచినట్లుగా సామెత జానపద విజ్ఞానంలో మౌఖిక జానపద విజ్ఞానానికి చెందిన కథారహిత వచన శాఖకు సంబంధించినది.

ఈ సిద్ధాంత గ్రంథంలో సామెత నిర్వచనాలలో పేర్కొనినట్లుగా 'సామెతలు అనుభవమే పునాదిగా ఉన్న సాంప్రదాయిక అభివ్యక్తులు' (ఆర్వీయస్ సుందరం). అవి 'ఒక జాతి యొక్క అనుభూతి పారమ్యాన్ని ప్రతిబింబిస్తాయి' (విశ్వనాథ సత్యనారాయణ); 'జాతి అనుభవాలను ఆత్మను ఆవిష్కరిస్తాయి' (ఫ్రాన్సిస్ బేకన్). అందువలన వాటిని 'సామాన్య జనుల యొక్క అనుభవ సాగరాలుగా పేర్కొనవచ్చును' (కాలిపు వీరభద్రుడు).

ఈ సైద్ధాంతిక నేపథ్యంతో అసంఖ్యాకంగా ఉన్న తెలుగు, బైబులు సామెతలను పరిశీలించాను. వాటిలో సమానార్థకాలుగా ఉన్నవాటిని పరిశోధించాను. ఈ పరిశోధనలో సమానార్థకాలుగా ఉన్న జంట సామెతలలో ఒక దానిలోని భావం రెండవదానిలో విస్తరించినదా, సంకోచించినదా లేక ఉద్దీపించినదా మొదలైనవాటి మీద దృష్టిని నిలిపాను. ఈ పరిశోధనలో జంట సామెతలలోని ఒక సామెత విషయాన్ని సామాన్య రీతిలో చెప్పి ఊరుకుంటే రెండవది దాని పర్యవసానాన్ని కూడా పేర్కొనడం గమనించాను. కొన్ని జతలలో రెండు సామెతలు ఖచ్చితమైన భావైక్యంతో పరస్పరం ఊతమిచ్చుకొనేలా కనిపించాయి. పరిశీలించిన వాటిలో చాలా తెలుగు సామెతలు ఆలంకారికంగా ఉంటే బైబులు సామెతలు చాలాచోట్ల నిరలంకారంగా ఉన్నాయి. అందుకు అవి హీబ్రూ, గ్రీకు భాషల నుండి అనువాదమైనవి కాబట్టి మూల భాషలలో ఉన్న సొగసు అనువాదంలో అంతగా ఉండకపోవడం కూడా ఒక కారణం కావచ్చు.

మానవ స్వభావానికి సంబంధించిన సమానార్థకమైన తెలుగు, బైబులు జంట సామెతలలో దుర్గుణాలను ఎత్తి చూపేవే ఎక్కువగా ఉన్నాయి. దీని అర్థం విడివిడిగా చూచినప్పుడు కూడా తెలుగు, బైబులు సామెతలలో సద్గుణాలను గురించి చెప్పేవి తక్కువగా ఉన్నాయని కాదు. తెలుగు, బైబులు సామెతలలో సమానార్థకాలైన వాటిలో ఈ కోవకు చెందినవే ఎక్కువగా ఉండడం మాత్రమే దీనికి కారణం.

అయితే ఇక్కడ గమనించవలసినది వేరొకటున్నది. సామెత నేరుగా సద్గుణాలను గురించి ప్రస్తావించినా, దుర్గుణాలను గురించి ప్రస్తావించినా అందులో అంతర్లీనంగా ఉన్న సందేశం మాత్రం విజ్ఞతనూ, సుగుణాన్నీ అలవరచుకోమనే. ఉదాహరణకు 'నోరు మంచిదైతే ఊరు మంచిదౌను' అన్నా, 'అటుకులు బొక్కే నోరు, ఆడిపోసుకునే నోరు ఊరుకోవు' అన్నా ఇవి రెండూ వాచాలత్వాన్ని ఖండిస్తూ, వాక్శుద్ధిని కలిగి ఉండాలని ఉద్బోధించేవే.

ఈ పరిశోధనలో పరిశీలించిన సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతలను బట్టి ఈ రెండు జాతులను గురించి తెలుస్తున్న మరికొన్ని విషయాలు ఇవి: రెండు జాతుల వారికి ఈ సామెతల కాలంలో ప్రధాన వృత్తి వ్యవసాయం. వ్యవసాయం అక్కడా ఇక్కడా కూడా ప్రధానంగా వర్షాధారమైనదే. రెండు జాతులవారు ఆస్తికులే. అపారమైన మత వాఙ్మయం కలిగినవారే. పాలనాపరంగా రాచరిక వ్యవస్థలో ఉన్నవారే. సత్య సంధత, వాక్శుద్ధి వంటి విలువలు వారికీ వీరికీ శిరోధార్యమైన ఆదర్శాలే. రెండూ పురుషాధిక్య సమాజాలే. అందువలన స్త్రీ పరిస్థితి అక్కడా ఇక్కడా ఇంచుమించుగా ఒక్కటే.

సామెత నిర్వచనాన్ని బట్టి చూచినపుడు భౌగోళికంగా వేలకొలది మైళ్ళ దూరంలోనున్న తెలుగు, బైబులు సమాజాలలో వేల, వందల కొలది సంవత్సరాల క్రితం పుట్టిన సామెతలలో ఇన్ని సమానార్థకాలు ఉండడానికి ప్రధాన కారణం మానవులు ఎక్కడున్నా, ఎలా ఉన్నా వారి అనుభూతులు, అనుభవాలు ఒకే విధంగా ఉండడం.

కాఫీ మొక్క బ్రెజిల్‌లో పెరిగినా, భారతదేశంలో పెరిగినా, పేరు ఏదైనా అది కాఫీ మొక్కే. దాని మౌలిక స్వభావం ఎక్కడున్నా ఒక్కటే. ఇదే సత్యం మానవులకు కూడా అన్వయిస్తుంది. శ్వేత జాతీయుడైనా నీలవర్ణుడైనా, అమెరికాలోనున్నా ఆఫ్రికాలోనున్నా మనిషి రాగద్వేషాలూ, సహజ స్వభావాలూ, సంవేదనలూ ఒకే విధంగా ఉంటాయి. దానినే సమానార్థకాలైన ఈ తెలుగు, బైబులు సామెతలు స్పష్టం చేస్తున్నాయి.

అందువలన దహన సంస్కారానికి పురికొల్పే సంకుచితమైన సరిహద్దులను, కృత్రిమమైన గుర్తింపులను ప్రక్కనపెట్టి విశాల దృక్పథాలను పెంపొందించే వసుధైవ కుటుంబక భావంతో మానవులు ముందుకు సాగడం ఉత్తమోత్తమం, శ్రేయోదాయకం!

# అనుబంధం

# అనుబంధం

## తెలుగు, బైబులు సామెతలు - సమానార్థకాలు

| తెలుగు సామెత | బైబులు సామెత |
|---|---|
| **మానవ స్వభావం: సహనశీలత** | |
| 1. గంజాయి తోటలో తులసి మొక్కవలె | ముండ్ల తుప్పలలో లిల్లీ పుష్పములాగా (పరమగీతం 2:2) |
| 2. పుటము వేసినదే బంగారం | వెండి బంగారములను కుంపటి పరీక్షించును (సామెతలు 17:3) |
| **మానవ స్వభావం: స్నేహం** | |
| 1. అక్కరకు వచ్చినవాడే అయినవాడు | స్నేహితుల కొరకు ప్రాణమిచ్చువాడే నిజమైన స్నేహితుడు (యోహాను 15:13) |
| 2. కలసిరాని కాలంలో కలిసొచ్చేవాడే స్నేహితుడు | సంపదలలో మంచి మిత్రుని గుర్తింపజాలము.కాని ఆపదలలో చెడ్డ స్నేహితుని తప్పక గుర్తించవచ్చును (సీరా 12:8) |
| 3. చెడి స్నేహితుని ఇంటికి పోవచ్చు గానీ సోదరునింటికి పోరాదు | ఆపదలు వచ్చినప్పుడు స్నేహితునింటికి పొమ్ముగాని సోదరునింటికి పోవలదు (సామెతలు 27:10) |
| **మానవ స్వభావం: మూర్ఖత్వం** | |
| 1.ఎత్తెత్తిపోసినా ఇత్తడి బంగారమగునె? | మూర్ఖుని రోటబెట్టి దంచినను వాని మూర్ఖత్వమును తొలగింపజాలము (సామెతలు 27:22) |
| 2. ఏటివంకలెవరు తీరుస్తారు? కుక్కతోకనెవరు చక్కజేస్తారు? | వంగినదాని వంకర తీయలేము (ఉపదేశకుడు 1:15) |
